ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 19 ఆగస్టు 2025



తుపాకీ కాల్పుల కలకలం

- బొగ్గు దొంగతనాలకు పాల్పడే ఇరువర్గాల నడుమ పాతకక్షలు
- ఈ క్రమంలో మద్యం మత్తులో ఘర్షణ...కాల్పులు
- క్షతగాత్రుడు కేజీహెచ్‌కు తరలింపు
- పోలీసుల అదుపులో నిందితులు? ... మెయిన్‌లో



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేష్

ఉక్కు సెగలు



కేంద్రం చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేని వైనం

- ప్రైవేటీకరణ యోచనను పక్కనపెట్టామంటూనే ఒక్కో విభాగం నిర్వహణ బయట సంస్థలకు అప్పగింత
- ఉద్యోగులు భారీగా తగ్గింపు?
- రాబోయే రోజుల్లో పర్యవేక్షణకే పరిమితం
- కార్మిక సంఘాల ఆందోళన
- గంగవరం పోర్టు విస్తరణకు స్టీల్‌ప్లాంటు భూములు?
- జిందాల్ స్టీల్‌కు పోటీ లేకుండా ముందస్తు ప్రణాళిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం అగ్నిగుండంగా మారుస్తోంది. నిత్యం ఏదో కొత్త సమస్యను సృష్టిస్తూ ఉద్యోగ, కార్మిక సంఘాల్లో అలజడి రేపుతోంది. ప్రైవేటీకరణ ఆలోచన ప్రస్తుతానికి పక్కన పెట్టామని, ప్లాంటును లాభాల బాటలోకి తేవడానికి యత్నిస్తున్నామని కేంద్రం చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన కుదరడం లేదు.

ప్లాంటులో ఉద్యోగులను కుదించే ప్రక్రియను గత ఆరు నెలలుగా వేగవంతం చేశారు. వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) ద్వారా ఫిబ్రవరిలో 1,140 మందిని ఇంటికి పంపించేశారు. మళ్లీ రెండోసారి రెండు నెలల క్రితం వీఆర్ఎస్ ప్రకటించారు. ఈసారి మరో వేయి మందిని తీసేస్తారంటున్నారు. ఇక కాంట్రాక్టు వర్కర్లలో 4,500 మందిని మే నెలలో తొలగించారు. ఈ ఆరు నెలల్లో రిటైరైన వారితో కలుపుకొంటే ఏడు వేల మంది తగ్గిపోయారు. ఐదేళ్ల నుంచి పూర్తిగా రిక్రూట్‌మెంట్ ఆపేశారు. ఉత్పత్తి వ్యయం పెరిగిపోతున్నదని, దానిని తగ్గించడానికే ఇవన్నీ చేస్తున్నామని సమర్థించుకుంటున్నారు. అయితే ఉద్యోగుల భత్యాల్లో కోతలే కనిపిస్తున్నాయి గానీ ఇతర ముడి పదార్థాల వ్యయం తగ్గించిన దాఖలాలు లేవు. పైగా పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడుపుతామని స్టీల్ తయారీకి అవసరమైన పెల్లెట్లను గతం కంటే ఎక్కువ ధర పెట్టి లక్షల టన్నులు కొనుగోలు చేస్తున్నారు. వాటిని సొంతంగా తయారు చేసుకునే సౌలభ్యం ఉంది. కానీ బయట కొంటున్నారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం గతం కంటే పెరిగిందని ఉద్యోగ వర్గాలు ... మిగతా 6వ పేజీలో



స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ప్రైవేటీకరణ నోటిఫికేషన్లను ఉపసంహరించుకోవాలి

- అఖిలపక్ష కార్మిక సంఘ నాయకుల డిమాండ్
- ప్రధాన పరిపాలన భవనం ముందు ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈవోఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) నోటిఫికేషన్లకు వ్యతిరేకంగా సోమవారం ప్లాంటు ప్రధాన పరిపాలనా విభాగం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం అనుమతితోనే ఉక్కు యాజమాన్యం కీలక విభాగాల్లో ఈవోఐ ప్రకటించిందని ఆరోపించారు. గొప్ప ప్యాకేజీ ప్రకటించామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు...దానివల్ల కార్మిక వర్గానికి జరిగిన లాభం శూన్యమన్న సంగతిని గ్రహించాలన్నారు. ప్లాంటులో వీఆర్ఎస్ ద్వారా వందల మంది ఉద్యోగులను బయటకు పంపేశారని, అదే విధంగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారన్నారు. ఇప్పుడు కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటును ఏదోవిధంగా నాశనం చేద్దామన్న కుట్ర జరుగుతుందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, పీవీ రమణమూర్తి, యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, పి.శ్రీనివాసరాజు, గంగాధర్, వి.ప్రసాద్, కారు రమణ, బీఎన్ రాజు, బంటు రాము, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు... పొంగిన గెడ్డలు

ముసురు

పలుచోట్ల రోడ్లపైకి నీరు

- అక్కడక్కడా కుంగిన రహదారులు
- బీచ్‌లో కూలిన రక్షణగోడ

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రభావంతో నగరంలో వరుసగా మూడో రోజు వర్షాలు కొనసాగాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, మురుగుకాల్వలు పొంగాయి. పూర్ణామార్కెట్ పరిసరాల్లోని వెలంపేట, కల్లుపాకలు, రామకృష్ణా జంక్షన్, కొబ్బరితోట, చిలకపేటల్లో రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలలకు ముందుగానే సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకు పరిమితమయ్యారు. కాగా వర్షాలు కొనసాగడంతో కొండవాలు ప్రాంతాలవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పెదగదిలిలో ఒక ఇంటి పిట్టగోడ కూలి పక్కనే ఉన్న రేకులషెడ్‌పై పడింది. ఆ సమయంలో రేకుల షెడ్‌లో నిద్రిస్తున్న ఒకరు గాయపడ్డారు. అలాగే పెదగదిలి సంజీవ్‌నగర్ కాలనీలో ఇంటికి ఆనుకుని మట్టి జారిపడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన డెక్ భవనం సమీపాన రోడ్డు కుంగింది. ఇంకా బీచ్ రోడ్డులో వరుణ్‌పార్కుకు ఆనుకుని నిర్మించిన రక్షణ గోడ కొంతమేర కూలింది.

కాగా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని రెండు రోజులుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం సోమవారం ఉదయం తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది. దీంతో సముద్ర అలలు తీరం దిశగా ఎగిసిపడుతున్నాయి. ఈ ... మిగతా 6వ పేజీలో



అక్కయ్యపాలెం వద్ద జాతీయ రహదారిపై నిలిచిన నీరు



వరుణ్ బీచ్ పార్కు వద్ద కూలిన రక్షణ గోడ



సిరిపురం జంక్షన్ వద్ద కుంగిపోయిన రోడ్డు

సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నమోదైన వర్షపాతం

కేంద్రం	మిల్లీమీటర్లు
వాల్తేర్ తుపాన్ హెచ్చరిక కేంద్రం	37.8
అక్కిరెడ్డిపాలెం (పెందుర్తి)	31.5
సీతమ్మధార	31.0
మహారాణిపేట	28.5
గాజువాక	25.25

హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం



బీచ్ రోడ్డులో కొత్తగా ఏర్పాటుచేసిన యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని సోమవారం మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, నౌకాదళ అధికారులు పాల్గొన్నారు. - వివరాలు 8లో

కేజీహెచ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- సీఎస్ఆర్ బ్లాక్‌లో నిలిచిన వైద్య సేవలు
- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన సీఎస్ఆర్ బ్లాక్ అత్యంత కీలకమైనది. తీవ్ర అనారోగ్యం బారినపడినవారికి ఆ బ్లాక్‌లోనే చికిత్స అందిస్తుంటారు. ముఖ్యమైన శస్త్ర చికిత్సలు, క్యాన్సర్ వైద్య సేవలు, స్కానింగ్‌లు అక్కడే నిర్వహిస్తారు. అయితే సోమవారం ఉదయం ఒక్కసారిగా బ్లాక్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ కూడా పనిచేయకపోవటంతో సుమారు రెండు, మూడు గంటల పాటు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్కానింగ్‌లు నిలిచిపోయాయి. దీంతో వైద్య సేవల కోసం కొత్తగా వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోయారు. ఐఆర్‌సీయూ విభాగంలో వైద్యులు రోగులకు కృత్రిమ శ్వాస అందించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఒక రోగి మృతి చెందినట్టు ప్రచారం జరిగినా, ఆసుపత్రి వైద్యాధికారులు ధ్రువీకరించలేదు. రెండు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో సాంకేతిక సమస్య తలెత్తి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్టు అధికారులు అభిప్రాయపడ్డారు. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



సీఎస్ఆర్ వార్డులో చీకట్లోనే పడకలపై రోగులు

ఆర్ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

- '51 ఎంక్వయిరీ' ఆపాలని వినియోగదారుల పేరిట హైకోర్టులో పిటిషన్
- తప్పులు బయటపడతాయని భయం
- సర్వీసు నిబంధనలకు వ్యతిరేకం
- చర్యలు చేపట్టకుండా జిల్లా అధికారుల తాత్సారం
- ఆది నుంచి అదే తీరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్)లో కొందరు ఉద్యోగులు నిబంధనలను బేఖాతరు చేస్తూ చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా అడ్డగోలుగా ఉద్యోగంలో చేరి, అర్హతలు లేకుండా పదోన్నతులు పొంది లక్షల రూపాయల జీతం తీసుకుంటున్న వారు తమ తప్పులు బయట పడకుండా శతవిధాలా యత్నిస్తున్నారు.

ఆర్ఈసీఎస్‌లో భారీఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని, అర్హత లేకుండా చాలామందికి ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదులు అందడం, వాటిపై విచారణ చేయాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) కూడా సూచించడంతో రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఈ ఏడాది మార్చి నెలలో 51 విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారులు ఎవరితో విచారణ చేయాలో స్పష్టంగా ఆదేశాలు ఇవ్వకుండా ఆ బాధ్యత జిల్లా జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)కే వదిలేశారు. దాంతో విచారణాధికారిగా తుమ్మపాల షుగర్స్ ఎండీ ఎంవీఎస్ శాస్త్రిని అనకాపల్లి డీసీఓ ప్రేమస్వరూప నియమించారు. విచారణ జరిగితే మొత్తం తప్పులు బయట పడతాయని పాత రికార్డులు అందుబాటులో లేకుండా సిబ్బంది మాయం చేశారు. దాంతో విచారణ నెమ్మదిగా సాగుతోంది.

ఇదిలావుండగా ఆర్ఈసీఎస్ బాధ్యతలు చేపట్టిన ... మిగతా 6వ పేజీలో

సమన్వయంతో పనిచేద్దాం

- కూటమి ఎమ్మెల్యేలు, నేతలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా సమావేశం
- జిల్లాలో అమలు జరుగుతున్న పథకాలు, ప్రజల సమస్యల చర్చ
- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒక్కస్థానం కోల్పోవడంపై అసంతృప్తి
- భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచన
- జీవీఎంసీలో మలేరియా పోస్టులపై పలువురి ఫిర్యాదు



విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమిలో ఉన్న పార్టీలకు చెందిన వారందరం సమన్వయంతో పనిచేద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి సర్క్యూట్ హౌస్‌లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, విశాఖ దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌తో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో అమలు జరుగుతున్న పథకాలు, ప్రజల సమస్యలు, ఇటీవల జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒక స్థానం కోల్పోవడంపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ... మిగతా 6వ పేజీలో

ఉచిత ప్రయాణానికి డిజిటల్ ఐడెంటిటీ ఓకే

- ఆధార్ జెరాక్స్ కాపీలకు కూడా...
- వారం పాటు అనుమతించాలని ఆర్టీసీ నిర్ణయం



ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి వారం రోజులపాటు డిజిటల్ ఐడెంటిటీ కార్డులు, జెరాక్స్ కాపీలను అనుమతిస్తున్నట్టు విశాఖ రీజియన్ అధికారులు సోమవారం ప్రకటించారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు (రాష్ట్రానికి చెందినవారిగా ధ్రువీకరణ కోసం) ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్‌పాస్ బుక్, రేషన్ కార్డు... వీటిల్లో ఏదో ఒకటి ఐడెంటిటీగా కండక్టర్‌కు చూపించాలి. కొందరు ఒరిజినల్ ఆధార్ కార్డులు చూపిస్తుండగా, మరి కొందరు ఆధార్‌కార్డు జెరాక్సులు, ఇంకొందరు సెల్‌ఫోన్‌లో డిజిటల్ ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ వంటివి చూపుతున్నారు. సిబ్బంది వాటిని అనుమతించేందుకు నిరాకరిస్తున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లింది. అన్ని డిజిటల్ ఐడెంటిటీ కార్డులను వారం రోజుల పాటు అనుమతించాలని, ఈలోగా మార్గదర్శకాలు జారీచేస్తామని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం అధికారులు సూచించారు. దీంతో విశాఖ రీజియన్‌లో డిజిటల్ ఐడెంటిటీని అనుమతిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. విశాఖలో వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలకు ఈ పథకం వర్తించదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



వాసుపల్లి సతీష్ (ఫైల్)



సంబాల ఉషారాణి

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మధురవాడ బస్టాప్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి సతీష్ (19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సంబాల ఉషారాణి స్నేహితులు. ఉషారాణి ఉద్యోగ అన్వేషణ నిమిత్తం పరదేశిపాలెంలో గదిని అద్దెకు తీసుకుని ఉంటోంది. సతీష్‌కు తల్లి లేదు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ చేపలుప్పాడ సమీపాన గల కొత్తూరులో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం సతీష్, ఉషారాణి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై పరదేశిపాలెం నుంచి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. మధురవాడ బస్టాప్ వద్దకు వచ్చేసరికి లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి, దాని కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ తెలిపారు.

జోడుగుళ్లపాలెంలో విషాదం

విశాలాక్షినగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాసుపల్లి సతీష్ స్వస్థలం జోడుగుళ్లపాలెం. సతీష్ తల్లి తొమ్మిదేళ్ల క్రితం మృతిచెందగా, తండ్రి దాస్, 17 ఏళ్ల తమ్ముడు ఉన్నారు. సతీష్ తల్లి మృతిచెందాక తండ్రి దాస్ మరో వివాహం చేసుకుని వీరికి దూరంగా ఉంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో సతీష్ మృతిచెందడంతో అతడి బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నగరంలో 121 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- గీత కులాలకు పది బార్లు రిజర్వు
- ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు
- ఎక్సైజ్‌శాఖ డీసీ శ్రీరామమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్

-8లో

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,016 విరాళం


దాతలకు బాండు అందజేస్తున్న ఆలయ అధికారి సూర్యనారాయణ

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై కొలువైన శ్రీ వరాహలక్ష్మీనర సింహ స్వామివారి నిత్యాన్న ప్రసాదానికి నగ రానికి చెందిన నరసింహం మాధవరావు, రాధారాణి దంపతులు రూ.1,00,116 విరా ళంగా అందజేశారు. ఆలయ పీఆర్‌వో కార్యా లయంలోని డొనేషన్ కౌంటర్‌లో దాతలు నగదు చెల్లించి రశీదు పొందారు. దాతలకు ఆలయ సీనియర్ సహాయకుడు సూర్యనారా యణ నిత్యాన్న ప్రసాదం బాండ్‌ను అందజే శారు. అనంతరం దాతలు స్వామివారిని దర్శిం చుకున్నారు. వేదపండితులు దాతలకు వేదా శీర్వచనాలు పలికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాం జనేయస్వామి అన్నారు. సోమవారం ఆయన పరదేశిపాలెం ఎస్సీ బాలికల హస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం-స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి ఎస్సీ హస్టల్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. జర్మనీలో నర్సింగ్ వృత్తిలో ఉద్యోగాల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసి న శిక్షణ శిబిరంలో మొదటివిడతలో 75 మందికి శిక్షణ ఇవ్వనుండగా మొదటిరోజు 29 మంది అక్కడే చేరారని తెలిపారు. వీరందరికీ పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ బాలికల వ సతిగృహంలో 8 నెలలు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అక్కడ శిక్షణ అ నంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జర్మనీలో రెండున్నర లక్షల రూపాయల వేతనంతో ఉద్యోగ అవకాశాలు క ల్పించనున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి నిర్వహిం చి వలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్, డైరెక్టర్ లావణ్యవేణి, జిల్లా కలెక్టర్ హరేందిర ప్ర సాద్, స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీ అగస్టిన్, ఎండీ గణేష్, సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరె క్టర్ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి సురేష్, డీఎంహెచ్‌ఓ జగదీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, వేదికపై కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, ఇతర అధికారులు

సహాయక చర్యల్లో అధికారులు బిజీ

పద్మనాభం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాల ప్రభావిత ప్రాంతా ల్లో సోమవారం అధికార యంత్రాంగం పర్యటించి సహాయక చర్యలు చేపట్టింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గోస్తనీ పరివాహక గ్రామాలైన పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెంలో పొలాలు ముంపునకు గురికాకుం డా అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు లేక ఆఫీస్ కారణంగా ముం పునకు గురైన పొలాల్లోని నీటిని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా బయటికి పంపిం చారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ కె.ఆనందరావు, ఎంపీడీవో ఎం.విజయకు మార్‌లు ఆయా గ్రామాలను సందర్శించి ముంపు నివారణ చర్యలను పరిశీలించా రు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయశాఖల అ ధికారులు సైతం ఈ ముంపు నివారణ చర్యలలో పాల్గొన్నారు.

ముసురు

... 5వ పేజీ తరువాయి

ఏదాది రుతుపవనాల ప్రవేశం తరువాత మూడు రోజులపాటు వర్షాలు కురవడం ఇదే తొలిసారి. ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురవడంతో జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు అనుకూల వాతావరణం ఏర్పడింది. చెరువులు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నగరంలో భూగర్భ జ లాలు రీచార్జి కావడంతో బోర్లపై ఆధారపడేవారంతా ఊపిరిపీల్చుకున్నారు. వాయు గుండం నేప థ్యంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు వర్షాలు కురు స్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

సమన్వయంతో పనిచేద్దాం

... 5వ పేజీ తరువాయి

మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి పనిచేస్తున్నారని, అదే మాదిరిగా జిల్లాలో కూటమి పార్టీలకు చెందిన అందరూ ఎప్పటికప్పుడు సమావేశమై ప్రతి అంశంపై చర్చించు కుని, ముందుకు వెళదామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎవరికైనా ఇబ్బందులు టే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతేతప్ప బహిరంగంగా ఎక్కడా వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒ క సీటు కోల్పోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని సీట్లూ గెలుచుకునే బలం ఉన్నప్పుడు ఎందుకిలా జరిగిందని ప్రశ్నించారు. మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొ రేటర్ల మధ్య సమన్వయం ఉంటే ఇలా జరిగేది కాదని కొందరు అన్నప్పుడు మంత్రి జోక్యం చేసుకుని భవిష్యత్తులో అటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల ని సూచించారు. జీవీఎంసీలో మరోసారి బిల్లు విధానం కాంట్రాక్టు పోస్టులను పనిచేసే కార్పొరేటర్లు చెప్పిన వారికే ఇస్తున్నారని ఒకరిద్దరు ఫిర్యాదు చేయగా, మేయర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీఆర్‌సీ సమావేశం తర్వాత పూర్తిచేసుకుందామన్నారు. దానికి ముందు జిల్లాలో కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జులతో సమావేశం ని ర్వహిస్తామన్నారు.

అక్రమ కట్టడాలను నియంత్రిస్తా

» బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ


షణ్ముఖ శాస్త్రి

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అ క్రమ కట్టడాలను నియంత్రణకు శక్తి వం చన లేకుండా కృషిచే స్తానని పట్టణ ప్రణా ళిక ఏసీపీ షణ్ముఖశా స్త్రి అన్నారు. జీవీఎంసీ జోన్-2 ఏసీపీగా సోమ వారం ఆయన బాధ్యత లు స్వీకరించారు. ఇంతవరకు ఈ బాధ్యతల్లో ఉన్న తిరుమలరావు జోన్-5కు బదిలీపై వెళ్లారు. ఈ స్థానం నుంచి శాస్త్రి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువు రు సచివాలయ, పట్టణ ప్రణాళిక సిబ్బంది క లిసి అభినందించారు.

గెడ్డ ప్రవాహానికి అడ్డు తొలగింపు


గెడ్డ ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకమేటను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాగర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సాగ ర్‌నగర్ వద్ద గెడ్డ కలిసే చోట సముద్రం వేసిన ఇసుక మేటను జీవీఎంసీ యంత్రాంగం సోమ వారం జేసీబీ సహాయంతో తొలగింపు కార్య క్రమం చేపట్టింది. గెడ్డ ప్రవాహానికి అడ్డుగా ఇసుక మేట వేసి, సముద్రంలో వరదనీరు చేరకుండా బీచ్ ప్రాంతాన్ని ముంచెత్తింది.భారీ వర్షాల కారణంగా గెడ్డలో ప్రవాహం నిలిచిపోవ డంతో నీరు బీచ్‌రోడ్డుపై ఉన్న కల్వర్టును తాకడమే కాకుండా గెడ్డలో నుంచి వచ్చే వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో పరిసర ప్రాంతాలు తీవ్ర దుర్గంధ భరితంగా మారాయి. సమస్యను గుర్తించిన జీవీఎంసీ గెడ్డ ప్రవాహా నికి అడ్డువచ్చిన ఇసుక మేటను జేసీబీతో తొల గించే పనులు నిర్వహించారు. గెడ్డలో నీరు సముద్రంలోకి కలిసే మార్గం సుగమమైంది.

సింహగిరిపై భారీ వర్షం


గంగధార నుంచి ప్రవహిస్తున్న నీరు

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురు స్తున్న వర్షాలకు శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాం గణంలోని జలధారలు ఉద్ధృతంగా ప్రవహిచాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓ మోస్తరు వర్షం కురవ డంతో, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కాస్త ఇబ్బంది ప డ్డారు. స్వామి వారిని దర్శించుకున్న తరువాత వర్షం తగ్గుముఖం పట్టే వరకూ భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వేచి ఉన్నారు. ముసురు ప్రభావంతో ఆలయానికి భక్తుల తాకిడి తగ్గుముఖం పట్టింది. శనివారం రాత్రి నుంచి ఈ ప్రాంతంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు పొంగుతున్నాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది.

నలుగురు ఎస్ఐల బదిలీ

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో న లుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్త ర్వులు జారీ చేశారు. సిటీ అర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఉన్న తిరుపతిరావును భీమిలి ట్రాఫిక్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న సీహెచ్ చిరంజీవిని ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి చెందిన వికసకరావును ఆరిలోవ ట్రాఫిక్ విభాగానికి, వీఆర్‌లో ఉన్న ఎల్. మురళీకృష్ణను సీసీఆర్‌బీకి బదిలీ చేశారు. వెంటనే వెంటనే విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వర్షపు నీటిని చెరువుల్లోకి మళ్లించండి

» అధికారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచన

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున వర్షపు నీరు వృథా కాకుండా చెరువులకు మళ్లించేలా అధి కారులు కృషిచేయాలని భీమిలి శాసనసభ్యుడు గం టా శ్రీనివాసరావు సూచించారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొమ్మాదిలోని చెరువును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్థానికులు మాట్లాడుతూ గతం లో వర్షపు నీరు చెరువులోకి వెళ్లటానికి రెండు మా ర్గాలు ఉండేవని, చెరువు ఆయకట్టుకు సమయం లో అది మూసుకుపోవటంతో ప్రస్తుత వర్షపునీరు చెరువుకు వెళ్లే మార్గం లేక గ్రామంలోకి వస్తుంద న్నారు. చెరువులోకి వెళ్లే మార్గ గోర్రి నుంచి డ్రైనే జు స్థలాల్లోని నీరు చేరుకుంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చెరువులోకి నీరు మళ్లేలా రెం డు గోర్జలను కూడా శాశ్వత ప్రాతిపదికన నిర్మిం చాలని ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదే శించారు. ఎమ్మెల్యే వెంట చిరంజీవిరావు, జెడ్పీ క నకమహాలక్ష్మి, ఈతి శాంతిరాజు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, టీడీపీ యువనేత గోగునుడాస్, మొల్లి లక్ష్మణరావు, పి ళ్లా వెంకట్రావు, లొడగల జానకిరామ్, మన్నాల సోంబాబు, నాగేశ్వరరావు, నాగోతి సత్యనారాయ ణ, కొండపు రాజు, వెంకటరమణ పాల్గొన్నారు.


స్థానికులు, అధికారులతో కలిసి కొమ్మాది చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆర్ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

... 5వ పేజీ తరువాయి

ఈపీడీసీఎల్ అధికారులు ఇటీవల ఆర్ఈసీఎస్ ఉద్యోగుల సర్వీసు రికార్డులు పరిశీ లించారు. పదోన్నతులు పొందిన వారి అర్హతలను తనిఖీ చేశారు. సస్పెన్షన్‌లో ఉండగా పదోన్నతులు పొందారని, అదేవిధంగా పదోన్నతులు పొందడానికి నిర్ణీత సమయం ఉండగా, దానిని కూడా పాటించలేదని గుర్తించారు. ఈ విధంగా అధిక మొత్తాలు పొందుతున్న వారి జీతాలను జూలై నెల నుంచి తగ్గించేస్తూ ఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ అధికంగా పొందిన జీతాలను ఎలా రికవరీ చేయాలా...అని ఆలోచిస్తోంది. ఇలా ఒక్కొక్క బండారం బయట ప డుతుండడంతో త్వరలో 51 విచారణలు నిధుల దుర్వినియోగం కూడా వెలుగులో కి వస్తుందని అక్రమార్కులు భయపడుతున్నారు. దీనిని అడ్డుకోవాలని యత్నిస్తున్నారు.

వినియోగదారుల పేరుతో హైకోర్టులో కేసు

సొసైటీలో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఐదుగురు (ఎం.వరదేశినాయుడు, ఆదారి ప్రసన్నరాణి, బొమ్మిశెట్టి సత్యవేణి, పిల్లారి శివకుమార్, బొక్కం కనకరావు) సా ధారణ విద్యుత్ వినియోగదారులుగా ఈ నెల 4వ తేదీన హైకోర్టులో పిటిషన్ వేశా రు. అనకాపల్లి ఆర్ఈసీఎస్‌పై జరుగుతున్న 51 విచారణను నిలిపివేయాలని, దా నిపై స్టే ఇవ్వాలని కేసు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనల ప్ర కారం...ఏ ప్రభుత్వ సంస్థ గాని, ఉద్యోగులపై గాని ఆరోపణలు వచ్చి ప్రభుత్వం విచారణ చేస్తుంటే...దానిని ఆపాలని కోర్టుకు వెళ్లే హక్కు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉండదు. ఆ విచారణను ఎదుర్కోవాలి. నివేదిక వచ్చాక ప్రభుత్వం శి క్షవేసాక, కాని ఇక్కడ ఈ ఐదుగురు కూడా తాము ఉద్యోగులమని పిటిషన్‌లో పే ర్కొనకుండా వాస్తవం దాచి పెట్టడం గమనార్హం. ఈ నెల 4వ తేదీన కేసు ఫైల్ కాగా ఆ విషయం వెంటనే పక్కనే ప్రాసిక్యూటర్ సంబంధిత అధికారులకు తెలియ జేస్తారు. దానిపై కౌంటర్ వేయడానికి సమాచారం ఇవ్వాలని కోరతారు. ఆ వివరా లు ఆర్ఈసీఎస్‌కు రావాలి. దానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎండీగా ఆన కాపల్లి ఈపీడీసీఎల్ ఎస్ఈ వ్యవహరిస్తున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి 51 ఎంక్వయిరీకి అధికారిని నియమించారు. హైకోర్టులో కేసు వేసిన వారు ఎవరో ముందుగా చూడాలి. వారు ఇక్కడ పనిచేస్తున్న వారే కాబట్టి అది సర్వీసు రూల్స్ కు వ్యతిరేకం అయినందున చర్యలు చేపట్టాలి. కానీ ఎవరూ తమకు హైకోర్టులో కేసు విషయం తెలియదని చెబుతున్నారు. ఆ కేసు వేసిన ఉద్యోగులను పిలిచి కని స విచారణ కూడా చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా సహకార శాఖ అధికారులు మేల్కొంటారా? లేదో మరి.

అధికారులు అప్రమత్తం


మంగమారిపేట తీరంలో పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్

భీమునిపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో భీమిలి లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాల ఉధృతితో మంగమారిపేట గ్రామంలో కెరటాలు మత్స్యకారులు భయాందోళనలకు గురయ్యారు. అలాగే, ప ట్టణంలో ప్రభుత్వ సమాచార... జీవీఎంసీ కోతకు గురైంది. అప్రమత్తమైన భీ మిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, మండల తహసీల్దార్ పైల రామారావు మంగమారిపేట తీరాన్ని సందర్శించారు. అక్కడ మత్స్యకారులతో మా ట్లాడి, అందరికీ చెందవద్దని జిల్లా ఫైనాన్సర్‌లో ఏర్పాటు చేస్తున్న అ త్యవసర పునరావాస కేంద్రంలో తలదాచుకోవాలని సూచించారు. గో స్తనీ పరివాహక గ్రామాలైన సామయ్యవలస, మునివానిపాలెంలో పొ లాలు ముంపునకు గురికాకుండా అధికారులు నివారణ చర్యలు చేప ట్టారు.

వర్షాల ఎఫెక్ట్..

నిలిచిన చేపల వేట.. మత్స్యకారుల ఇక్కట్లు

» మూడు రోజులుగా తీరానికే పరిమితమైన పడవలు

» ఆదాయం లేక అలమటిస్తున్నామంటూ ఆవేదన

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో భీమిలి రూరల్ మండలంలో తీర ప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లడం లేదు. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, అంతకుముందు అధికారులు జారీ చేసిన ప్రమాద హెచ్చరికల కార ణంగా చేపలవేటకు విరామాన్ని ప్రకటించారు. సముద్రంలోకి తీసుకు ని వెళ్లే తమ పడవలను తీరంలో నిలిపి వేశారు. భీమిలి మండ లంలో అన్నవరం, నాగయ్యపాలెం, పాతపాలెం తదితర ప్రాంతా లకు చెందిన మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా తీరంలో ఉండిపోయారు. ఒక మోటారు పడవపై నలుగురు సముద్రంలోకి చేపల వేటకు వెళుతుంటారు. వేటాడిన చేపల్లో పడవ యజమానికి ఒక వాటా పోగా, మిగిలినవి చేపలవేటకు వెళ్లినవారు పంచుకుం టారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో చాలా మంది అయిదు రోజుల నుంచి చేపలవేటకు వెళ్లడం లేదు. దీంతో.. రోజూ చేపల వేటకు వెళితే తప్ప జీవనం గడవని వీరి పరిస్థితి దయనీ యంగా ఉంది. కెరటాల ఉధృతి కారణంగా సముద్రతీరంలోనే తమ పడ వలను ఒక దానితో మరొక దానిని తాళ్లతో రక్షణగా కట్టి సముద్ర తీరం లోనే నిలిపి వేసి ఉంచారు. మరో రెండు రోజుల వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. ఇటువంటి సమయంలో తమ జీవనం ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అన్నవరం తీరంలో నిలిపి ఉంచిన పడవలు

ఉక్కు సెగలు

... 5వ పేజీ తరువాయి

ఆరోపిస్తున్నాయి.

విభాగాల వారీగా ప్రైవేటీకరణ

ప్లాంటును ప్రైవేటీకరించబోమని ఒకవైపు చెబుతూనే మరో వైపు ఒక్కో విభాగా న్ని 'నిర్వహణ' పేరుతో ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి 'ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన' (ఈఓఐ)లను జారీచేస్తున్నారు. ముందు రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, ఆ త రువాత సింటర్ ప్లాంటు, ఆపై ఫైర్ డిపార్టుమెంట్, తాజాగా థర్మల్ విద్యుత్ కేం ద్రం ప్రైవేటీకరణకు ఈఓఐలు ఇచ్చారు. శనివారం రాత్రి ఏకంగా మరో 32 విభాగా లు ప్రైవేటుకు ఇస్తామని ఈఓఐలు జారీచేశారు. అంటే ప్లాంటులో దాదాపుగా 80 శాతం విభాగాలు ప్రైవేటుకు ఇవ్వడానికి సిద్ధమైనట్టు అర్థమవుతోంది. దీనిపై ఇప్ప టివరకూ ఉద్యోగ సంఘాలతో గానీ, కార్మిక సంఘాలతో గానీ చర్చించలేదు. అంతా ఏకపక్షంగా సాగిపోతోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో విభాగాలన్నీ పూర్తిగా ప్రైవే టుకు అప్పగించేసి, వేల సంఖ్యలో ఉన్న శాశ్వత ఉద్యోగులను వందల్లోకి తీసుకురా వ్చి, వారిని పర్యవేక్షకులకు ఉపయోగిస్తారని చెబుతున్నారు. దీనివల్ల నిర్వహణ వ్య యం తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని అంటున్నారు.

చాప కింద నీరులా స్టీల్ ప్లాంటును క్రమంగా నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థల కు అప్పగించడానికి ఇవన్నీ చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్లాం టు నిర్వహణలో పనితీరు బాగా లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పి ఆ తరువాత ప్లాంటును అమ్మకానికి పెడతారని, అప్పుడు కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు విశాఖ స్టీల్‌ను ఎగరేసుకుపోతాయని, అదే వారి ప్రణాళిక అని ఉద్యోగ వర్గా లు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల సంఖ్య వేల నుంచి వందలకు తగ్గించడం వల్ల కా ర్మిక సంఘాలు బలహీనమవుతాయని, అప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా అడ్డుచెప్పేవారు ఉండరని, అడ్డుపడడం తగ్గుతుందనేది యాజమాన్యం ఆలోచనగా భావిస్తున్నారు.

ఒకరికి భూములు...ఇంకొకరికి ప్లాంటు

స్టీల్‌ప్లాంటు భూములపై అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కన్ను పడిం దంటున్నారు. పోర్టు విస్తరణకు కనీసం రెండు వేల ఎకరాలు అవసరమని, ప్రస్తు తం రైల్వే లైన్లకు కూడా భూములు కావాలని అడుగుతోందంటున్నారు. రెండు వా రాల క్రితం రైల్వే అధికారులు వెళ్లి రైల్వే లైన్లకు అవసరమైన భూములు పరిశీలిం చారు. స్టీల్ ప్లాంటు ఏ విధంగాను సహకరించడం లేదని యాజమాన్యానికి లేఖ లు రాశారు. స్టీల్ ప్లాంటులో ఏ విభాగాలు ప్రైవేటీకరించాలో చేయాలో అన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు సంఘాలు అందోళన చేయకుండా అంక్షలు పెట్టారు. ప్రశ్నించే వారికి నోటీసులు ఇ స్తున్నారు. ఏ ఒకటి చేసి తెరిచే తలుపు అదానీకి అవసరమైన భూములు అప్పగిస్తార ని, ఆ తరువాత పనితీరు ఆధారంగా ప్లాంటు విలువ తగ్గేలా చేసి...తక్కువ ధరకు జిందాల్ స్టీల్‌కు అప్పగిస్తారని, దాని కోసం ప్రణాళిక ప్రకారం ఇవన్నీ చేస్తున్నారని ఉక్కు కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

గోస్తనీ పరీవాహక గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

» ప్రవాహం ఉధృతంగా ఉంది.. సమీపానికి రావద్దు

» తహశీల్దార్ ఆనందరావు సూచన

» పలు గ్రామాల్లో క్షేత్ర పర్యటన

పద్మనాభం-రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యో తి): తుపాన్ ప్రభావంతో గడచిన నాలుగు రో జులుగా కురిసిన భారీ వర్షాలకు గోస్తనీ నది పొంగిపొర్లుతుండడంతో నదీ పరీవాహక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ కకర ఆనందరావు సూచిం చారు. సోమవారం ఉదయం విలసన్‌భాపాలెం, పొట్నూరు, కృష్ణాపురం, పాండ్రంగి, సామయ్య వలస, మునివానిపాలెం గ్రామాల్లో ఆయన ప ర్యటించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మా ట్లాడుతూ గడచిన కొద్దిరోజులుగా తాటిపూడి త రితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్నా రు. ఇప్పటికే పాండ్రంగి కాజ్‌వేపై రాకపోకలు నిషేధించామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూ డా మహిళలు, పిల్లలు, నదీ సమీపానికి వెళ్లరా దని, అధికారుల రాత్రి పగలుగా పర్యవేక్షించాలన్నా రు. గోస్తనీ పరీవాహక ప్రాంతాల్లో నీటి ప్రవా హం పెరగడం వల్ల ఆ గ్రామాల్లో రెవెన్యూ సి బ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించా రు. ఆయన వెంట ఆర్‌ఐ శ్యామల, వీఆర్వోలు అప్పలరాజు, శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.


పొంగిపొర్లుతున్న గోస్తనీ నది


పాండ్రంగిలో నీటముునిగిన వరి పంటను పరిశీలిస్తున్న తహశీల్దార్ ఆనందరావు, ఇతర అధికారులు

భీవణ వర్షం

మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజా ము వరకు 93.6 మి.మీ. వర్షపాతం నమోదైం ది. దీంతో కాలువ, పల్లిగెడ్డ పొంగి ప్రవహిస్తోం ది. ప్రస్తుత వర్షాలు ఆయా పంటలు వేసిన రైతులకు కొంత నష్టం కలిగించినప్పటికీ, వరి పంటలకు ఉపకరిస్తుందని రైతులు అంటున్నా రు. లోతట్టు ప్రాంతాలైన విలసన్‌ఖాన్ పాలెం, పాండ్రంగి, సామయ్యవలస గ్రామాల్లో సుమా రు 70 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్టు రై తులు చెబుతున్నారు. నీట మునిగిన పంటల ను అధికారులు సోమవారం ఉదయం పరిశీలిం చారు. జోరు వర్షంతో వాగులు, వంకలు, చెరు వుల్లో జలకళ సంతరించుకొంది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖ బ్రత బాగ్చి

తగరపువలస, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటే విధం గా ఆదేశాలు జారీ చేస్తున్నామని విశాఖ పోలీసు కమిషనర్ (సీపీ) డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. సోమవారం సంగివ లస ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ నిరోధక సదస్సుకు సీపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని, దీన్ని పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాగింగ్ చేసే విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అనే విషయాన్ని ఆయన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివ రించారు. విద్యాలయాల ఆవరణలో జరిగే ర్యాగింగ్ కూడా శా కళాశాలల్లో విద్యార్థులను చైతన్యం చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థుల ను కళాశాలలను నుంచి తొలగించడంతో పాటు వారి తల్లిదం డ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సమా వేశంలో ఏసీపీ అప్పలరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల తరఫున చంద్రో జిరెడ్డి, సుధాకర్ పోలీసు కమిషనర్‌ను సత్కరించి మెమెం టోను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన వారికి కమిషనర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

జాతీయస్థాయి యుక్‌మాస్ పోటీల్లో మధురవాడ విద్యార్థుల ప్రతిభ

మధురవాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యుక్‌మాస్ పోటీల్లో మధురవాడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి అవార్డులు పొందినట్టు యుసీఎంఏఎస్ ఫ్రాంఛైజ్ డైరెక్టర్ ఎం.ఎస్.పల్లవిసుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో ఈ నెల 16, 17 తేదీల్లో 24 వ యుక్‌మాస్ నేషనల్ లెవెల్ పోటీలు నిర్వహిం చారు. ఆబాకస్ పోటీల్లో మధురవాడకు చెందిన ఏడేళ్ల డి.జ్యోషిత్ రేయాన్ ఫౌండేషన్ కేటగిరీలో చాంపియన్‌షిప్ సాధించారు. ఫౌండేషన్ కేటగి రీలో ఎనిమిదేళ్ల జీవితాశ్రీ రన్నరప్‌గా నిలిచింది. ఎనిమిదేళ్ల బైషా, శ్యామ్ సంప్రీత్, శ్యామ్‌సాత్విక్ 'ఏ' కేటగిరీలో ప్రతిభ సాధించినట్టు పల్లవిసు మన్ పేర్కొన్నారు.



విజేతలతో డైరెక్టర్ పల్లవిసుమన్

12, 13 వార్డుల్లో మేయర్ పీలా పర్యటన

- ఇళ్ల గోడలు కూలిన బాధితులకు పరామర్శ
- ఆదుకుంటామంటూ భరోసా
- స్థానికులతో మాటామంతీ
- అసంపూర్తి రహదారులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



రామకృష్ణాపురంలో కూలిన ఓ ఇంటి గోడలను పరిశీలిస్తున్న నగర మేయర్ శ్రీనివాసరావు. జడ్సీ-2 కనకమహాలక్ష్మి, టీడీపీ నేత కెల్ల సత్యనారాయణ

ఆరిలోవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో 12వ వార్డులోని పెదగదిలి, 13వ వార్డులోని రామకృష్ణాపురంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల ఇళ్లు, ఆస్తులు దెబ్బ తిన్న వారిని పరామర్శించారు. ఆయా ప్రాంతాల వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల కూలిపోయిన ఇంటి గోడలను మేయర్ జీవీఎంసీ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చేస్తామని పెదగదిలికి చెందిన పైడిరాజు కుటుంబ సభ్యులకు, అలాగే రామకృష్ణాపురానికి చెందిన పాటిమీద దినేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతా సత్యన్నారాయణ. జోన్-1 కమిషనర్ కనకమహాలక్ష్మి, స్థానిక నాయకులు బాబూరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఈ ప్రాంతంలో రోడ్లు అసంపూరణంగా వేశారని, మిగిని వాటిని కూడా వేయాలని కోరాగా, మేయర్ స్పందిస్తూ ఈ ప్రాంతంలో రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్‌ను సూచించారు. అలాగే గెడ్డలో ఉన్న పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. వార్డుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, వర్షాల నేపథ్యంలో నష్టపోయిన వారికి పరిహారం అందలా తప్పక చర్యలు తీసుకుంటామని మేయర్ పీలా శ్రీనివాసరావు హామీఇచ్చారు. పెదగదిలి ప్రాంత పర్యటనలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, 12 వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ 12వ అధ్యక్షుడు గాడి సత్యం పాల్గొన్నారు.

అభివృద్ధికి పరిశోధనలు మూలం

- డీఆర్‌డీవో కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్

బీచ్ రోడ్డు, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి) : సైన్స్‌లో జరిగిన పరిశోధనా ఫలితాలు నేడు ప్రపంచాభివృద్ధికి ఎంతగానో దోహద పడ్డాయని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్ పేర్కొన్నారు. సోమవారం ఆర్కే బీచ్ వద్ద ఆంధ్రా విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు చేపట్టే వారికి సాంకేతిక పరికరాల వినియోగంపై తప్పనిసరిగా అవగాహన ఉన్నప్పుడే పరిశోధన ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. సైన్స్ వైపు యువత దృష్టి సారించేలా వారి ఆలోచనలో మార్పు వచ్చే విధంగా బోధనా సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీవో అనేక ప్రయోగ శాలలను కలిగి ఉందని, ఇవి రక్షణ సాంకేతిక రంగాలలో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఏరోనాటిక్స్, ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ వంటి సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. అత్యంత కీలకమైన రక్షణ, సాంకేతిక వ్యవస్థల్లో స్వయం సమృద్ధిని సాధించడం చాలా ప్రాముఖ్యమన్నారు. దేశవ్యాప్తంగా డీఆర్‌డీఏకు 51 పరిశోధనలు ఉన్నాయన్నారు. సుమారు ఐదువేలకు పైగా సైంటిస్టులు నిరంతరం భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ కోసం, తద్వారా దేశ కోసం పాటు పడుతున్నారన్నారు. భారత శాస్త్రీయ పురోగతి రంగంలో దేశ సాంకేతిక దృశ్యాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. భారతదేశాన్ని శక్తివంతం చేయాలనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. రక్షణ సాంకేతికత అభివృద్ధిలో డీఆర్‌డీవో గణనీయమైన మైలురాళ్లను అధిగమించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆర్వీఎస్ ప్రసాద్, వైస్ అడ్మిరల్ కాళిదాస్, శ్రీనివాస్, ఎస్.మానిక్ వాసగం, డాక్టర్ మను కొరుళ్ల, వేద వీర్ ఆర్యా, ఏయూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ



అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్యచంద్రరావు. పాల్గొన్న ఏయూ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరాలజీ (ఐఐటీఎం) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో సోమవారం వీసీ జీపీ రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ ఎ.సూర్య చంద్రరావులు అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులు సాధించే దిశగా ఈ రెండు సంస్థలు పనిచేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోమారు ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలని నిర్ణయించారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ మౌసం కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఏయూను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏయూ వాతావరణ అధ్యయన విభాగం అధిపతి పి.సునీత, రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఐఐటీఎం శాస్త్రవేత్తలు డి.పద్మకుమారి, సచిన్ దేశ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన గోడలు



రామకృష్ణాపురంలో కూలిన ఇంటి గోడ

ఆరిలోవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావ కారణంగా గత మూడు రోజులు నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆరిలోవ ప్రాంతంలో రెండు చోట్ల ఆదివారం మధ్యాహ్నం ఇంటి గోడలు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జీవీఎంసీ 13 వ వార్డులో గల రామకృష్ణాపురంలో పాటిమీద దినేష్‌కుమార్ రేకుల షెడ్డు గోడ కూలిపోయింది. అలాగే పెదగదిలిలో గల కొండవాలు ప్రాంతంలో సారికి పైడిరాజు ఇంటి గోడ కూలి పోయింది. ఈ ప్రమాదంలో పైడిరాజు భార్య మారెమ్మ (65)కాలికి స్వల్ప గాయమైంది.

అధ్వానంగా రహదారులు

- గోతుల్లో ఎక్కడికక్కడే నిలిచిన వర్షం నీరు
- రాకపోకలకు తప్పని అవస్థలు



శివాజీ పార్కు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. పలు చోట్ల వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. శనివారం పడిన వర్షానికే కాలువలు నిండిపోయి ప్రవహించాయి. భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరు బయటకు పొంగింది. సోమవారం ఉదయం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. చిరు వ్యాపారులు తమ దుకాణాలను తెరుచుకునే వీలు లేకుండాపోయింది. ఇదే వర్షం కొనసాగుతుందేమోనన్న భయం వ్యాపారుల్లో నెలకొనడంతో, వ్యాపారాలను మూసేశారు. అయితే మధ్యాహ్నం నుంచి వర్షం తెరిపినిచ్చింది. ఏఎస్ రాజా కూడలి వద్ద అన్ని వైపులా నుంచి నీటి ప్రవాహంతో కూడలి కాసేపు నీటిలో దిగ్బంధమైంది. ముడసర్లోవ నుంచి వచ్చే గెడ్డ హనుమంతువాక మీదుగా వెంకోజీపాలెం, ఎంవీపీలోని పలు సెక్టర్లలో నుంచి ప్రవహిస్తుంది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి దాదాపు గెడ్డ అంచులను తాకుతూ నీటి ప్రవాహం సాగింది. కాలనీల్లో కూడా ఎక్కడికక్కడ మురుగునీరు దర్శనమిచ్చింది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి కొంత తెరిపి ఇవ్వడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించడంతో రహదారులపై వాహన రద్దీ చాలా వరకూ తగ్గింది. మంగళవారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో, ఎలా ఉంటుందోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



ఎంవీపీ డబుల్ రోడ్డులో ఇదీ పరిస్థితి

29, 30 తేదీల్లో ఐసీఏఐ సెమినార్

మద్దిలపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 29, 30న ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ చెప్పారు. పిఠాపురం కాలనీలోని ఐసీఏఐ భవనంలో ఆయన సెమినార్ బ్రోచర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సెమినార్‌లో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రినారా లోకేష్, ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నంద, సీఏ రేవతి, సుబ్బారావులు పాల్గొంటారని చెప్పారు. అర్థ సమృద్ధి ఎకానమీ ప్రాస్పరిటీ పేరుతో నిర్వహించే సెమినార్‌లో దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలు ఎటువంటి పాత్ర పోషిస్తున్నారో వక్తలు వివరిస్తారని తెలిపారు. అలాగే సీఏలో అవకాశాలు, ఆర్థిక పరమైన అంశాలను కూలంకుశంగా చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ వైజాగ్ బ్రాంచ్ ఛైర్మన్ అందవరపు శ్రీధర్, కార్యదర్శి రామునాయుడు, పట్నాల లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కులో 34 విభాగాల ఈవోఐను రద్దు చేయాలి

- అనకాపల్లి వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

మద్దిలపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కులో 32 విభాగాల ఈవోఐను తక్షణమే రద్దు చేయాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ప్రజలు, కార్మికులను మోసం చేశాయని విమర్శించారు. స్టీల్‌ప్లాంటు రోజురోజుకూ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమలో 45-50 విభాగాలుండగా, 34 విభాగాలు ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ఈనెల 16న ఆయా విభాగాల నిర్వహణకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కోరుతూ జారీ చేసిన నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజకీయ పార్టీలు, సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉక్కు ఉద్యోగుల పోరాటంపై టీడీపీ నేతలు అవహేళన చేస్తున్నారన్నారు. ఓట్లేసి గెలిపించినందుకు అడుగడున అవమానాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

వినాయక చవితికి పందిరిరాట



పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శనగర్ కాలనీ వాసులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పంతొమ్మిదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ రెండవ వీధిలో వినాయకచవితి ఉత్సవాల కోసం పందిరిరాట ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కాలనీ యువత, మహిళలు పాల్గొన్నారు. స్థానిక యంగ్‌స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువకులు ఈ నెల 27 నుంచి వినాయకచవితి నవరాత్రులు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా ఖేల్‌కూద్



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విశాలాక్షినగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా భారతీ రాష్ట్ర ఖేల్‌కూద్ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బీవీకే పాఠశాలలో బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచి ఐదు సమితుల విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకులు కె.కృష్ణమోహనరావు, కేఆర్కే సత్యనారాయణ, కె.చక్రవర్తి, కేవీ ఆనందం పర్యవేక్షించారు.

సినిమా గైడ్

- **వార్-2 :** జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

బీకే అగర్వాల్‌కు ఇమేజ్ కొలీగ్ సొసైటీ ఇంటర్నేషనల్ గౌరవ పురస్కారం



రామ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఫొటోగ్రాఫర్, విశాఖ వాసి బీకే అగర్వాల్‌కు ఇమేజ్ కొలీగ్ సొసైటీ ఇంటర్నేషనల్ గౌరవ పురస్కారం లభించింది, ఈ సంస్థ ఫొటోగ్రఫీ పరిశ్రమ అభివృద్ధికి అంకితమైన ప్రతిష్ఠాత్మక సంస్థ. ఛాయాచిత్ర గ్రాహకుల ప్రతిభా పాటవాలను గుర్తించి ఏటా గౌరవ పురస్కారాలు అందిస్తుంది. ఫొటోగ్రఫిక్ రంగం పురోభివృద్ధికి కృషి చేస్తున్న విశాఖకు చెందిన బీకే అగర్వాల్‌కు గౌరవ పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ న్యాయనిర్ణేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా తోటి ఫొటోగ్రాఫర్లు అగర్వాల్‌కు అభినందనలు తెలియజేశారు. త్వరలోనే విజయవాడలో జరుగనున్న ప్రత్యేక ఫొటోగ్రఫీ సదస్సులో పురస్కారం అందించనున్నట్టు సంస్థ ప్రతినిది టీఎస్ రెడ్డి తెలిపారు.

వరద నివారణకు సత్వర చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నందున జీవీఎంసీ యంత్రాంగం అత్యవసర చర్యలు చేపడుతోందని కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లతో పాటు యంత్రాంగం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తోందన్నారు. ఇప్పటివరకు 28 చెట్లు నేలకూలగా రాకపోకలకు ఆటంకం లేకుండా వెంటనే తొలగించామన్నారు. రాపిడ్ యాక్షన్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయన్నారు. ప్రధాన గెడ్డలను పరిశీలించామని, ఫిర్యాదులపై స్పందించి 24 గంటలు సమస్య పరిష్కారానికి అందుబాటులో ఉన్నామన్నారు. శిథిల భవనాల్లో నివసిస్తున్న వారిని జీవీఎంసీ సామాజిక భవనాలు, పాఠశాలల్లో ఆశ్రయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రహదారులు, కాలువల్లో వ్యర్థాలను తొలగించామన్నారు. బలమైన గాలులకు హోర్డింగులు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని పట్టణ ప్రణాళిక విభాగం తొలగిస్తోందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు రిజిస్టర్డ్ కాంట్రాక్ట్ ఏజెన్సీని నియమించామన్నారు. నీటి ట్యాంకర్లను సిద్ధం చేశామని, వ్యాధుల నివారణకు క్లోరిన్ లిక్విడ్, ఆలం నిల్వ ఉంచామన్నారు. అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని, జీవీఎంసీ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 180042500009 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కేంద్రానికి ఇప్పటివరకు 97 ఫిర్యాదులు రాగా 94 పరిష్కరించామని, మిగిలినవి సత్వరం పరిష్కరిస్తామన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 30, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 64, కీర దోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30,కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట)4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

క్యాన్సర్ నివారణకు సంయుక్త పరిశోధనలు అవసరం

- అంతర్జాతీయ సదస్సులో గీతం ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ



గీతంలో నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

సాగర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ మంజూరు చేసిన స్పార్క్ (స్కీమ్‌ఫర్ ప్రమోషన్ అకడమిక్ అండ్ రీసెర్చి కొలాబరేషన్) ప్రాజెక్టులో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, అమెరికాలోని ఒరిగాన్ హెల్త్, అండ్ సైన్స్ యూనివర్సిటీ సంయుక్తంగా క్యాన్సర్ పరిశోధనలపై గీతంలో సోమవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళిని కాపాడేందుకు పరిశోధకులు సంయుక్త అధ్యయనం జరపాలని, స్పార్క్ ప్రాజెక్టు ద్వారా క్యాన్సర్‌పై పరిశోధనలు జరుపుతున్నవారిని ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. గీతంలోని క్యాన్సర్ బయాలజీ ప్రయోగశాల ద్వారా జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఒరిగాన్ బయాలజీ పరిశోధనా కేంద్రం డైరక్టర్ ప్రొఫెసర్ సంజయ్‌మల్హోత్రా గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. తమ పరిశోధనాకేంద్రం టార్కెట్ థెరపి ద్వారా రొమ్ము క్యాన్సర్ చికిత్సకు మార్గాలు గుర్తించిందని తెలిపారు. గీతం స్పార్క్ ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ మళ్ల రామారావు క్యాన్సర్ పరిశోధనల ప్రాధాన్యత, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తదితరులు పాల్గొన్నారు. మూడురోజులు జరిగే ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన క్యాన్సర్ పరిశోధకులు ప్రసంగిస్తారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

రోజు వ్యవధిలోనే చోరీ బైకులు అప్పగింత

పెందుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం బైకులు చోరీకి గురయ్యాయి. తక్కువ సమయంలోనే వాటిని గుర్తించి యజమానులకు అప్పగించినట్టు ఎస్‌ఐ సూరిబాబు తెలిపారు.

PUBLIC NOTICE

This is to notify the general public that my client Mrs. Yelisetti Sri Lakshmi residing at Dr.No.49-54-9/3/2/1, B.S.Layout, Visakhapatnam-530013 transferred the property on same address from her name to her son in the year 2012 via Gift deed Num **925/2012** (SRO Akkayapalem, Vizag). It has come to the knowledge of my client that there are transactions executed without notifying her. Purpose of this notice is to warn and alert who might be involved with any kind of transactions vide registered or unregistered means. If it comes to the client notice that any such transactions have taken place after 2012 March, they will be considered null and illegal. Persons involved shall be legally punishable.

U. MANIKANTA
ADVOCATE
Visakhapatnam. Cell: **9701210781**

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఇబ్బందులు తొలగిస్తానని గణబాబు హామీ

మర్రిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 57వ వార్డు మర్రిపాలెం శ్యామ్‌నగర్‌కాలనీలో సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. రెండు రోజుల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వార్డు పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు, గెడ్డలను ఆనుకొని ఉన్న కాలనీల్లో ఆయన పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్యామ్‌కాలనీలో గెడ్డల్లో పారుతున్న వర్షంనీరు కాలనీ ప్రధాన రహదారిలో భారీ ఎత్తున చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు తెలియజేయడంతో వెంటనే వర్షంనీరు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండంతో కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయా కాలనీలవాసులకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట ఆజయ్‌బాబు, ముదపాక శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్యామ్‌నగర్‌కాలనీ గెడ్డ ప్రాంతం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విద్యుత్ తీగలపై కూలిన చెట్టు

అక్కయ్యపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా గ్రేటర్ 26వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులోని సత్యసాయి మందిరం లైన్‌లో భారీ చెట్టు విద్యుత్ తీగలపై, ఇంటికి అడ్డంగా రోడ్డుపై కూలిపోయి పడింది. స్థానికుల సమాచారం మేరకు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ వచ్చి పరిశీలించారు. వెంటనే ఉద్యానవన శాఖ విభాగం ఏఈ వెంకటరమణ బృందాన్ని పంపించి చెట్టును నరికించి తొలగించారు. అలాగే సచివాలయం సెక్రటరీ లావణ్య సలహా మేరకు జీవీఎంసీ ఏఎంహెచ్‌వో ప్రసాద్‌కి ఫోన్ చేసి జేసీబీ పంపాలని కోరారు. అధికారుల సహకారంతో చెట్టును తొలగించి రోడ్డును శుభ్రం చేయించారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును కోస్తున్న సిబ్బంది

బురదలో అడుగెయ్యాల్సిందే..!



గురుద్వార బస్‌బే వద్ద రహదారిపై రాళ్లు తేలి, గోతిలో నిలిచిన వర్షపు నీరు

సీతంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా..ఎంతో ఖర్చుతో నిర్మించిన బస్ బేలు అధ్వానంగా మారాయి. బస్సులు నిలిపే చోట రహదారి అంతా రాళ్లు తేలాయి. పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. దీంతో ఆ గొయ్యిల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. బస్ బే స్టాప్‌లో ప్రయాణికులు నిరీక్షించేచోట ఫ్యాన్లు లేవు. రాళ్లు తేలిన రహదారిలో ప్రయాణికులు నడిచి వెళ్లి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సులు కూడా వర్షపు నీటిలో వస్తుండటంతో ప్రయాణికులపై బురద వెదజల్లుతుంది. బస్సు ఎక్కాల్సిన ప్రయాణికులు బురదలో అడుగేసి రావాల్సి ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సు స్టాప్‌ల వద్ద రహదారిని బాగుచేయాలని, కనీస వసతులు కల్పించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

అభాగ్యులకు షెల్టర్



అభాగ్యులను తరలిస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డు నెరెళ్ల కోనేరు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా రోడ్డుపై ఉంటున్న అభాగ్యులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దిక్కు తోచని స్థితిలో ఉండడంతో స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు స్పందించి డే అండ్ నైట్ షెల్టర్ కార్యదర్శి సహకారంతో పెందుర్తిలోని లయోలో అనాథ ఆశ్రమంలో చేర్పించారు.కార్పొరేటర్ స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బుజ్జి, బాబులు, శ్రీను, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసురు

... 5వ పేజీ తరువాయి

ఏడాది రుతుపవనాల ప్రవేశం తరువాత మూడు రోజులు వర్షాలు కురవడం ఇదే తొలిసారి. మోస్తరు నుంచి భారీవర్షాలు కురవడంతో జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు అనుకూల వాతావరణం ఏర్పడింది. చెరువులు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నగరంలో భూగర్భ జలాలు రీచార్జి కావడంతో బోర్లపై ఆధారపడేవారంతా ఊపిరిపీల్చుకున్నారు. వాయుగుండం నేపథ్యంలో మంగళవారం వరకు వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

సమన్వయంతో పనిచేద్దాం

... 5వ పేజీ తరువాయి

మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కలిసి పనిచేస్తున్నారని, అదే మాదిరిగా జిల్లాలో కూటమి పార్టీలకు చెందిన అందరం ఎప్పటికప్పుడు సమావేశమై ప్రతి అంశంపై చర్చించుకుని, ముందుకు వెళదామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎవరికైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతేతప్ప బహిరంగంగా ఎక్కడా వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒక సీటు కోల్పోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని సీట్లూ గెలుచుకునే బలం ఉన్నప్పుడు ఎందుకిలా జరిగిందని ప్రశ్నించారు. మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మధ్య సమన్వయం ఉంటే ఇలా జరిగేది కాదని కొందరు అన్నప్పుడు మంత్రి జోక్యం చేసుకుని భవిష్యత్తులో అటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. జీవీఎంసీలో మలేరియా విభాగంలో కాంట్రాక్టు పోస్టులను వైసీపీ కార్పొరేటర్లు చెప్పిన వారికే ఇస్తున్నారని ఒకరిద్దరు ఫిర్యాదు చేయగా, మేయర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీఆర్‌సీ సమావేశం త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. దానికి ముందు జిల్లాలో కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

గోతిలో కూరుకుపోయిన వ్యాన్



సీతమ్మధార, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ రోడ్డులో మంచి నీటి పైపు లైన్ కోసం గోతులు తవ్వి పైపులు వేసి మట్టితో కప్పివేశారు. దీంతో ఆ గొయ్యిలో వర్షపు నీరు చేరడంతో మట్టి కిందికి దిగిపోయింది. గురుద్వార రహదారి నుంచి వస్తున్న మినీ వ్యాన్ రోడ్డు పక్కకు రావడంతో ఆ వ్యాన్ ముందు టైర్, వెనుక టైర్ రెండూ గోతిలో కూరుకుపోయాయి. దీంతో ఆ వాహనదారుడు ఇబ్బంది పడ్డారు. వ్యాన్‌లో ఉన్న లోడ్‌ను దించి గోతిలో నుంచి వాహనాన్ని బయటకు తీశారు.

డిజైన్ థింకింగ్ ద్వారా ఆకర్షణీయమైన బోధన

» కృష్ణా విశ్వవిద్యాలయ వీసీ డా.కె.రాంజీ » ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం

కంచరపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆమోదంతో సోమవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' ప్రధాన లక్ష్యంతో ఆన్‌లైన్ విధానంలో జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజులు జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.కె.రాంజీ, సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం.ఎ.వి.రామకృష్ణ అతిథులుగా హాజరై ప్రసంగించారు. డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను వీరు వివరించారు. అధ్యాపకులు బోధనలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించాలని కోరారు. భవిష్యత్‌లో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఎదగనున్నదన్నారు. ఫైనైట్ ఎలిమెంట్స్, ఫైనైట్ వాల్యూమ్, ఫైనైట్ డిఫరెన్స్ భవిష్యత్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో వినియోగంలోకి వస్తాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏపీలో 20 ప్రోగ్రామ్‌లలో ఎంపికైన కళాశాల కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కో-ఆర్డినేటర్ డా.సీహెచ్.రాజు, కో-కోఆర్డినేటర్ ఎం.భరణి, గౌరవ అతిథిగా డా.కె.నారాయణ రావు, ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్, డా.కె.వి.రమణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.కె.రాంజీ

ఆర్‌ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

(5వ పేజీ తరువాయి)

ఈపీడీసీఎల్ అధికారులు ఇటీవల అక్కడి ఉద్యోగుల సర్వీసు రికార్డులు పరిశీలించారు. పదోన్నతులు పొందిన వారి అర్హతలను తనిఖీ చేశారు. సస్పెన్షన్‌లో ఉండగా పదోన్నతులు పొందారని, అదేవిధంగా పదోన్నతులు పొందడానికి నిర్ణీత సమయం ఉండగా, దానిని కూడా పాటించలేదని గుర్తించారు. ఆ విధంగా అధిక మొత్తాలు పొందుతున్న వారి జీతాలను జూలై నెల నుంచి తగ్గించేస్తూ ఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ అధికంగా పొందిన జీతాలను ఎలా రికవరీ చేయాలా?...అని ఆలోచిస్తోంది. ఇలా ఒక్కొక్క బండారం బయట పడుతుండడంతో త్వరలో 51 విచారణతో నిధుల దుర్వినియోగం కూడా వెలుగులోకి వస్తుందని అక్రమార్కులు భయపడుతున్నారు. దీనిని అడ్డుకోవాలని యత్నిస్తున్నారు.

వినియోగదారుల పేరుతో హైకోర్టులో కేసు

సొసైటీలో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఐదుగురు (ఎం.పరదేశినాయుడు, ఆడారి ప్రసన్నరాణి, బొమ్మిశెట్టి సత్యవేణి, విల్లూరి శివకుమార్, బొక్కం కనకారావు) సాధారణ విద్యుత్ వినియోగదారుల్లా ఈ నెల 4వ తేదీన హైకోర్టులో పిటిషన్ వేశారు. అనకాపల్లి ఆర్‌ఈసీఎస్‌పై జరుగుతున్న 51 విచారణను నిలిపివేయాలని, దానిపై స్టే ఇవ్వాలని కేసు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనల ప్రకారం...ఏ ప్రభుత్వ సంస్థపై గాని, ఉద్యోగులపై గాని ఆరోపణలు వచ్చి ప్రభుత్వం విచారణ చేస్తుంటే...దానిని ఆపాలని కోర్టుకు వెళ్లే హక్కు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉండదు. ఆ విచారణను ఎదుర్కోవాలి. నివేదిక వచ్చాక చర్యలకు సిద్ధపడాలి. కానీ ఇక్కడ ఈ ఐదుగురు కూడా తాము ఉద్యోగులమని పిటిషన్‌లో పేర్కొనకుండా వాస్తవం దాచి పెట్టడం గమనార్హం. ఈ నెల 4వ తేదీన కేసు ఫైల్ కాగా ఆ విషయం వెంటనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంబంధిత అధికారులకు తెలియజేస్తారు. దానిపై కౌంటర్ వేయడానికి సమాచారం ఇవ్వాలని కోరతారు. ఆ వివరాలు ఆర్‌ఈసీఎస్‌కు రావాలి. దానికి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఎండీగా అనకాపల్లి ఈపీడీసీఎల్ ఎస్‌ఈ వ్యవహరిస్తున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి 51 ఎంక్వయిరీకి అధికారిని నియమించారు. హైకోర్టులో కేసు వేసిన వారు ఎవరో ముందుగా చూడాలి. వారు ఇక్కడ పనిచేస్తున్న వారే కాబట్టి అది సర్వీసు రూల్స్‌కు వ్యతిరేకం అయినందున చర్యలు చేపట్టాలి. కానీ ఎవరూ తమకు హైకోర్టులో కేసు విషయం తెలియదని చెబుతున్నారు. ఆ కేసు వేసిన ఉద్యోగులను పిలిచి కనీస విచారణ కూడా చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా సహకార శాఖ అధికారులు మేల్కొంటారా? లేదో మరి.

నలుగురు ఎస్‌ఐల బదిలీ

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమీషనరేట్ పరిధిలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేసారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఉన్న తిరుపతిరావును భీమిలి ట్రాఫిక్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న సీహెచ్ చిరంజీవిని ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి చెందిన వి.కనకారావును ఆరిలోవ ట్రాఫిక్ విభాగానికి, వీఆర్‌లో ఉన్న ఎల్.మురళీకృష్ణను సీసీఆర్‌బీకి బదిలీ చేశారు. వెంటనే వెంటనే విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలు విశాఖ, సత్యసాయి



విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆతిథ్య విశాఖ, సత్యసాయి జిల్లా జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఇరుజట్లు అద్భుతంగా రాణించాయి. సోమవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. విశాఖ జట్టు కోచ్ ఎస్.గణేష్, సహాయ కోచ్ అజీజ్, మేనేజర్ రాజన్న, నిర్వాహక ప్రతినిధులు చినబాబు, చక్రవర్తి, ఎస్‌జీ.రామకృష్ణ, రాజారావు, త్రినాథరావు (బాబు), సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు ఉద్యోగాలు

కంచరపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులు ఐదుగురు రాజస్థాన్‌లోని కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ హెచ్‌పీసీఎల్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలిపారు. వీరి ప్రారంభ వార్షిక వేతనం రూ.9.62 లక్షలు అని పేర్కొన్నారు. సోమవారం వీరికి కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్స్) ఎం.ఎ.వి.రామకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కెమికల్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. పూర్వ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, సీనియర్ అధ్యాపకుడు ఎస్.వి.రమణ, పీపీ విభాగం ఇన్‌ఛార్జి డా.సముద్రాల ప్రశాంతి కుమారి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న డీడీ డా.రామకృష్ణ, ప్రిన్సిపాల్ కె.వి.రమణ

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



దుర్గాగణపతి ఆలయం వద్ద రాట వేస్తున్న కార్పొరేటర్ గోవింద్, భక్తులు

సీతంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని రాట ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రాటను ఆలయ అర్చకులు నటరాజన్ మంత్రోచ్చారణతో ప్రతిష్ఠింపజేశారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు, ఆలయ ఈఓ రమాబాయి, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ కల్చరల్ కార్నివాల్



స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు అసోసియేషన్ ఆఫ్ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించిన 'సావన్ అయోర్-ఎ కల్చరల్ కార్నివాల్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సోలో నృత్యాలు, జానపద నృత్యాలు, మోనో యాక్టింగ్, సమూహ సృజనాత్మక ప్రదర్శనల పోటీల్లో 97 మంది ప్రాతినిధ్యం వహించి ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ సంప్రదాయ, జానపద కళల్లో సృజనాత్మక ప్రతిభకు అద్దంపట్టే ఇటువంటి కల్చరల్ కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, ఈకార్వో ప్రతినిధులు మధుస్మిత సాహు, డాక్టర్ భాషిణి ప్రియాంక, వి.భవ్య, బిల్కిస్ బానో తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి చిత్తడిగా రైతు బజార్

సీతమ్మధార, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల జనం ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. చిరువ్యాపారులు, రైతు బజార్‌లో రైతులు కొనుగోలుదారులు రాకపోవడంతో డీలా పడ్డారు. సీతమ్మధార రైతు బజార్ వర్షపు నీరుతో చిత్తడి చిత్తడిగా మారింది. దీంతో కుండపూత వర్షం పడుతుండటంతో బజార్‌కి కొనుగోలుదారులు అతి తక్కువగా వచ్చారు. దీంతో రైతులు తెచ్చిన కూరగాయాలు అమ్ముడు కాలేదు. రైతులు తాము తెచ్చిన వాటినిక అమ్ముకోకపోవడంతో పాటు అసలు కొనుగోలుదారులు రాకపోవడంతో నిరసంతో స్టాల్స్‌లోనే పడుకున్నారు. పువ్వులు వ్యాపారులు, ఆకు కూరాల రైతులు తాము తెచ్చిన వాటికి వర్షపు నీటితో తడిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఏమీ చేయాలో తోచక స్టాల్స్‌లోనే ఉండిపోయారు. మరోవైపు రైతు బజార్‌లో వర్షపు నీరు ఎక్కడబడితే అక్కడే నిలువై ఉంది. రైతుబజార్ చివరి గేటు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో అటుగా కొనుగోలుదారులు నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయింది. రైతుబజార్‌లో చివర కొడుగుడ్లు అమ్మే స్టాల్ ప్రక్కన పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వ ఉండటంతో పాటు పెద్ద ఎత్తు చెత్త చెదరం నిలిచిపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. సమీపంలో ఉన్న రైతు స్టాల్స్ వారు వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడ్డారు.



సీతమ్మధార రైతుబజార్‌లో పేరుకుపోయిన చెత్తచెదారం

ఉక్కు సెగలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపిస్తున్నాయి.

విభాగాల వారీగా ప్రైవేటీకరణ

ప్లాంటును ప్రైవేటీకరించబోమని ఒకవైపు చెబుతూనే మరో వైపు ఒక్కో విభాగాన్ని 'నిర్వహణ' పేరుతో ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి 'ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన' (ఈఓఐ)లు జారీచేస్తున్నారు. ముందు రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, ఆ తరువాత సింటర్ ప్లాంటు, ఆపై ఫైర్ డిపార్టుమెంట్, తాజాగా థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణకు ఈఓఐలు ఇచ్చారు. శనివారం రాత్రి ఏకంగా మరో 32 విభాగాలు ప్రైవేటుకు ఇస్తామని ఈఓఐలు జారీచేశారు. అంటే ప్లాంటులో దాదాపుగా 80 శాతం విభాగాలు ప్రైవేటుకు ఇవ్వడానికి సిద్ధమైనట్టు అర్థమవుతోంది. దీనిపై ఇప్పటివరకూ ఉద్యోగ సంఘాలతో గానీ, కార్మిక సంఘాలతో గానీ చర్చించలేదు. అంతా ఏకపక్షంగా సాగిపోతోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో విభాగాలన్నీ పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేసి, వేల సంఖ్యలో ఉన్న శాశ్వత ఉద్యోగులను వందల్లోకి తీసుకువచ్చి, వారిని పర్యవేక్షణకు ఉపయోగిస్తారని చెబుతున్నారు. దీనివల్ల నిర్వహణ వ్యయం తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని అంటున్నారు. చాప కింద నీరులా స్టీల్ ప్లాంటును క్రమంగా నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికే ఇవన్నీ చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రైవేటు నిర్వహణలో పనితీరు బాగా లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పి ఆ తరువాత ప్లాంటును అమ్మకానికి పెడతారని, అప్పుడు కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు విశాఖ స్టీల్‌ను ఎగరేసుకుపోతాయని, అదే వారి ప్రణాళిక అని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల సంఖ్య వేల నుంచి వందలకు తగ్గించడం వల్ల కార్మిక సంఘాలు బలహీనమవుతాయని, అప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా ఆందోళన చేయడం, అడ్డుపడడం తగ్గుతుందనేది యాజమాన్యం ఆలోచనగా భావిస్తున్నారు.

ఒకరికి భూములు...ఇంకొకరికి ప్లాంటు

స్టీల్‌ప్లాంటు భూములపై అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కన్ను పడిందంటున్నారు. పోర్టు విస్తరణకు కనీసం రెండు వేల ఎకరాలు అవసరమని, ప్రస్తుతం రైల్వే లైన్లకు కూడా భూములు కావాలని అడుగుతోందంటున్నారు. రెండు వారాల క్రితం రైల్వే అధికారులు వెళ్లి రైల్వే లైన్లకు అవసరమైన భూములు పరిశీలించారు. స్టీల్ ప్లాంటుకు ఏ విధంగాను సహకరించని అదానీ యాజమాన్యానికి భూములు ఎలా ఇస్తారని చాలాకాలంగా కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పుడు సంఘాలు ఆందోళన చేయకుండా ఆంక్షలు పెట్టారు. ప్రశ్నించే వారికి నోటీసులు ఇస్తున్నారు. ఏదో ఒకటి చేసి తొలుత అదానీకి అవసరమైన భూములు అప్పగిస్తారని, ఆ తరువాత పనితీరు ఆధారంగా ప్లాంటు విలువ తగ్గేలా చేసి...తక్కువ ధరకు జిందాల్ స్టీల్‌కు అప్పగిస్తారని, దాని కోసం ప్రణాళిక ప్రకారం ఇవన్నీ చేస్తున్నారని ఉక్కు కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

సినీ నటుడు సాయికుమార్‌కు కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం



సినీనటుడు సాయికుమార్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ కనకమహాలక్ష్మి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన శ్రావణ లక్ష్మి పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.

నిత్యాన్న పథకానికి విరాళం

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై కొలువైన శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామివారి నిత్యాన్న ప్రసాదానికి నగరానికి చెందిన నరిసిపురం మాధవరావు, రాధారాణి దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ పీఆర్‌వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో దాతలు నగదు చెల్లించి రసీదు పొందారు. దాతలకు ఆలయ సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ నిత్యాన్న ప్రసాదం బాండ్‌ను అందజేశారు. అనంతర దాతలు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రసాదాన్ని వారికి అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు



వినుతులు స్వీకరిస్తున్న జడ్సీ బి.రాము

జ్ఞానాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ప్రజల నుంచి 5 ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి సంబంధించి 2, యూసీడీ విభాగానికి 2,రెవెన్యూ 1 చొప్పున అర్జీలను స్వీకరించి .సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారం కొరకు అందజేశారు.ఈఈ ప్రసన్న,ఈఈ పద్మావతి,ఏపీడీ పుణ్యవతి,ఆర్ఓలు బాబురావు,రాజ్యలక్ష్మీ,టీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఆయన పరదేశిపాలెం ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం-స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జర్మనీలో నర్సింగ్ వృత్తిలో ఉద్యోగాల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో మొదటిదశలో 75 మందికి శిక్షణ ఇవ్వనుండగా మొదటిరోజు 29 మంది ఆసక్తి చూపించారు. వీరందరికీ పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో 8 నెలలు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జర్మనీలో రెండున్నర లక్షల రూపాయల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి నిర్వహించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్, డైరెక్టర్ లావణ్యవేణి, జిల్లా కలెక్టర్ హరేంధర్ ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీ అగస్టిన్, ఎండీ గణేష్, సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఎస్టీ వెల్ఫేర్ అధికారి సురేష్, డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, వేదికపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

12, 13 వార్డుల్లో మేయర్ పీలా పర్యటన

- ఇళ్ల గోడలు కూలిన బాధితులకు పరామర్శ
- ఆదుకుంటామంటూ భరోసా
- స్థానికులతో మాటామంతీ
- అసంపూర్తి రహదారులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



రామకృష్ణాపురంలో కూలిన ఓ ఇంటి గోడలను పరిశీలిస్తున్న నగర మేయర్ శ్రీనివాసరావు. జడ్సీ-2 కనకమహాలక్ష్మి, టీడీపీ నేత కెల్ల సత్యనారాయణ

ఆరిలోవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో 12వ వార్డులోని పెదగదిలి, 13వ వార్డులోని రామకృష్ణాపురంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల ఇళ్లు, ఆస్తులు దెబ్బ తిన్న వారిని పరామర్శించారు. ఆయా ప్రాంతాల వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల కూలిపోయిన ఇంటి గోడలను మేయర్ జీవీఎంసీ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చేస్తామని పెదగదిలికి చెందిన పైడిరాజు కుటుంబ సభ్యులకు, అలాగే రామకృష్ణాపురానికి చెందిన పాటిమీద దినేష్‌కుమార్‌క హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతా సత్యన్నారాయణ. జోన్-1 కమిషనర్ కనకమహాలక్ష్మి, స్థానిక నాయకులు బాబూరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఈ ప్రాంతంలో రోడ్లు అసంపూరణంగా వేశారని, మిగిని వాటిని కూడా వేయాలని కోరాగా, మేయర్ స్పందిస్తూ ఈ ప్రాంతంలో రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్‌ను సూచించారు. అలాగే గెడ్డలో ఉన్న పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. వార్డుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, వర్షాల నేపథ్యంలో నష్టపోయిన వారికి పరిహారం అందలా తప్పక చర్యలు తీసుకుంటామని మేయర్ పీలా శ్రీనివాసరావు హామీఇచ్చారు. పెదగదిలి ప్రాంత పర్యటనలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, 12 వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ 12వ అధ్యక్షుడు గాడి సత్యం పాల్గొన్నారు.

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ



అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్యచంద్రరావు. పాల్గొన్న ఏయూ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటీరాలజీ (ఐఐటీఎం) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో సోమవారం వీసీ జీపీ రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ ఎ.సూర్య చంద్రరావులు అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులు సాధించే దిశగా ఈ రెండు సంస్థలు పనిచేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోమారు ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలని నిర్ణయించారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ మౌసం కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఏయూను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏయూ వాతావరణ అధ్యయన విభాగం అధిపతి పి.సునీత, రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఐఐటీఎం శాస్త్రవేత్తలు డి.పద్మకుమారి, సచిన్ దేశ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కులో 34 విభాగాల ఈవోఐను రద్దు చేయాలి

- అనకాపల్లి వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

మద్దిలపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కులో 32 విభాగాల ఈవోఐను తక్షణమే రద్దు చేయాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ప్రజలు, కార్మికులను మోసం చేశాయని విమర్శించారు. స్టీల్‌ప్లాంటు రోజురోజుకూ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమలో 45-50 విభాగాలుండగా, 34 విభాగాలు ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ఈనెల 16న ఆయా విభాగాల నిర్వహణకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కోరుతూ జారీ చేసిన నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజకీయ పార్టీలు, సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉక్కు ఉద్యోగుల పోరాటంపై టీడీపీ నేతలు అవహేళన చేస్తున్నారన్నారు. ఓట్లేసి గెలిపించినందుకు అడుగడున అవమానాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

సినిమా గైడ్

- ● వార్-2 : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- ● కూలీ : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- ● సార్, మేడమ్ : మౌర్య (గోపాలపట్నం),
- ● మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 30, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 64, కీర దోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30,కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట)4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

బీకే అగర్వాల్‌కు ఇమేజ్ కొలీగ్ సొసైటీ ఇంటర్నేషనల్ గౌరవ పురస్కారం



రామ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఫొటోగ్రాఫర్, విశాఖ వాసి బీకే అగర్వాల్‌కు ఇమేజ్ కొలీగ్ సొసైటీ ఇంటర్నేషనల్ గౌరవ పురస్కారం లభించింది. ఈ సంస్థ ఫొటోగ్రఫీ పరిశ్రమ అభివృద్ధికి అంకితమైన ప్రతిష్ఠాత్మక సంస్థ. ఛాయాచిత్ర గ్రాహకుల ప్రతిభా పాటవాలను గుర్తించి ఏటా గౌరవ పురస్కారాలు అందిస్తుంది. ఫొటోగ్రఫిక్ రంగం పురోభివృద్ధికి కృషి చేస్తున్న విశాఖకు చెందిన బీకే అగర్వాల్‌కు గౌరవ పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ న్యాయనిర్ణేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా తోటి ఫొటోగ్రాఫర్లు అగర్వాల్‌కు అభినందనలు తెలియజేశారు. త్వరలోనే విజయవాడలో జరుగనున్న ప్రత్యేక ఫొటోగ్రఫీ సదస్సులో పురస్కారం అందించనున్నట్టు సంస్థ ప్రతినిధి టీఎస్ రెడ్డి తెలిపారు.

భారీ వర్షాలకు కూలిన గోడలు



రామకృష్ణాపురంలో కూలిన ఇంటి గోడ

ఆరిలోవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావ కారణంగా గత మూడు రోజులు నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆరిలోవ ప్రాంతంలో రెండు చోట్ల ఆదివారం మధ్యాహ్నం ఇంటి గోడలు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జీవీఎంసీ 13 వ వార్డులో గల రామకృష్ణాపురంలో పాటిమీద దినేష్‌కుమార్ రేకుల షెడ్డు గోడ కూలిపోయింది. అలాగే పెదగదిలిలో గల కొండవాలు ప్రాంతంలో సారికి పైడిరాజు ఇంటి గోడ కూలి పోయింది. ఈ ప్రమాదంలో పైడిరాజు భార్య మారెమ్మ (65)కాలికి స్వల్ప గాయమైంది.

అధ్వానంగా రహదారులు

- గోతుల్లో ఎక్కడికక్కడే నిలిచిన వర్షం నీరు
- రాకపోకలకు తప్పని అవస్థలు



శివాజీ పార్కు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. పలు చోట్ల వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. శనివారం పడిన వర్షానికే కాలువలు నిండిపోయి ప్రవహించాయి. భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరు బయటకు పొంగింది. సోమవారం ఉదయం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. చిరు వ్యాపారులు తమ దుకాణాలను తెరుచుకునే వీలు లేకుండాపోయింది. ఇదే వర్షం కొనసాగుతుందేమోనన్న భయం వ్యాపారుల్లో నెలకొనడంతో, వ్యాపారాలను మూసేశారు. అయితే మధ్యాహ్నం నుంచి వర్షం తెరిపినిచ్చింది. ఏఎస్ రాజా కూడలి వద్ద అన్ని వైపులా నుంచి నీటి ప్రవాహంతో కూడలి కాసేపు నీటిలో దిగ్బంధమైంది. ముడసర్లోవ నుంచి వచ్చే గెడ్డ హనుమంతువాక మీదుగా వెంకోజీపాలెం, ఎంవీపీలోని పలు సెక్టర్లలో నుంచి ప్రవహిస్తుంది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి దాదాపు గెడ్డ అంచులను తాకుతూ నీటి ప్రవాహం సాగింది. కాలనీల్లో కూడా ఎక్కడికక్కడ మురుగునీరు దర్శనమిచ్చింది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి కొంత తెరిపి ఇవ్వడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించడంతో రహదారులపై వాహన రద్దీ చాలా వరకూ తగ్గింది. మంగళవారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో, ఎలా ఉంటుందోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



ఎంవీపీ డబుల్ రోడ్డులో ఇదీ పరిస్థితి

వరద నివారణకు సత్వర చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నందున జీవీఎంసీ యంత్రాంగం అత్యవసర చర్యలు చేపడుతోందని కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లతో పాటు యంత్రాంగం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తోందన్నారు. ఇప్పటివరకు 28 చెట్లు నేలకూలగా రాకపోకలకు ఆటంకం లేకుండా వెంటనే తొలగించామన్నారు. రాపిడ్ యాక్షన్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయన్నారు. ప్రధాన గెడ్డలను పరిశీలించామని, ఫిర్యాదులపై స్పందించి 24 గంటలు సమస్య పరిష్కారానికి అందుబాటులో ఉన్నామన్నారు. శిథిల భవనాల్లో నివసిస్తున్న వారిని జీవీఎంసీ సామాజిక భవనాలు, పాఠశాలల్లో ఆశ్రయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రహదారులు, కాలువల్లో వ్యర్థాలను తొలగించామన్నారు. బలమైన గాలులకు హోర్డింగులు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని పట్టణ ప్రణాళిక విభాగం తొలగిస్తోందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు రిజిస్టర్డ్ కాంట్రాక్ట్ ఏజెన్సీని నియమించామన్నారు. నీటి ట్యాంకర్లను సిద్ధం చేశామని, వ్యాధుల నివారణకు క్లోరిన్ లిక్విడ్, ఆలం నిల్వ ఉంచామన్నారు. అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని, జీవీఎంసీ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 180042500009 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కేంద్రానికి ఇప్పటివరకు 97 ఫిర్యాదులు రాగా 94 పరిష్కరించామని, మిగిలినవి సత్వరం పరిష్కరిస్తామన్నారు.

క్యాన్సర్ నివారణకు సంయుక్త పరిశోధనలు అవసరం

- అంతర్జాతీయ సదస్సులో గీతం ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ



గీతంలో నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

సాగర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ మంజూరు చేసిన స్పార్క్ (స్కీమ్‌ఫర్ ప్రమోషన్ అకడమిక్ అండ్ రీసెర్చి కొలాబరేషన్) ప్రాజెక్టులో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, అమెరికాలోని ఓరిగాన్ హెల్త్, అండ్ సైన్స్ యూనివర్సిటీ సంయుక్తంగా క్యాన్సర్ పరిశోధనలపై గీతంలో సోమవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళిని కాపాడేందుకు పరిశోధకులు సంయుక్త అధ్యయనం జరపాలని, స్పార్క్ ప్రాజెక్టు ద్వారా క్యాన్సర్‌పై పరిశోధనలు జరుపుతున్నవారిని ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. గీతంలోని క్యాన్సర్ బయాలజీ ప్రయోగశాల ద్వారా జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఓరిగాన్ బయాలజీ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సంజయ్‌మల్హోత్రా గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. తమ పరిశోధనాకేంద్రం టార్కెట్ థెరపి ద్వారా రొమ్ము క్యాన్సర్ చికిత్సకు మార్గాలు గుర్తించిందని తెలిపారు. గీతం స్పార్క్ ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ మళ్ల రామారావు క్యాన్సర్ పరిశోధనల ప్రాధాన్యత, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తదితరులు పాల్గొన్నారు. మూడురోజులు జరిగే ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన క్యాన్సర్ పరిశోధకులు ప్రసంగిస్తారు.

అభివృద్ధికి పరిశోధనలు మూలం

- డీఆర్‌డీవో కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్

బీచ్ రోడ్డు, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి) : సైన్స్‌లో జరిగిన పరిశోధనా ఫలితాలు నేడు ప్రపంచాభివృద్ధికి ఎంతగానో దోహద పడ్డాయని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్ పేర్కొన్నారు. సోమవారం ఆర్కే బీచ్ వద్ద ఆంధ్రా విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు చేపట్టే వారికి సాంకేతిక పరికరాల వినియోగంపై తప్పనిసరిగా అవగాహన ఉన్నప్పుడే పరిశోధన ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. సైన్స్ వైపు యువత దృష్టి సారించేలా వారి ఆలోచనలో మార్పు వచ్చే విధంగా బోధనా సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీవో అనేక ప్రయోగ శాలలను కలిగి ఉందని, ఇవి రక్షణ సాంకేతిక రంగాలలో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఏరోనాటిక్స్, ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ వంటి సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. అత్యంత కీలకమైన రక్షణ, సాంకేతిక వ్యవస్థల్లో స్వయం సమృద్ధిని సాధించడం చాలా ప్రాముఖ్యమన్నారు. దేశవ్యాప్తంగా డీఆర్‌డీఏకు 51 పరిశోధనలు ఉన్నాయన్నారు. సుమారు ఐదువేలకు పైగా సైంటిస్టులు నిరంతరం భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ కోసం, తద్వారా దేశ కోసం పాటు పడుతున్నారన్నారు. భారత శాస్త్రీయ పురోగతి రంగంలో దేశ సాంకేతిక దృశ్యాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. భారతదేశాన్ని శక్తివంతం చేయాలనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. రక్షణ సాంకేతికత అభివృద్ధిలో డీఆర్‌డీవో గణనీయమైన మైలురాళ్లను అధిగమించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆర్వీఎస్ ప్రసాద్, వైస్ అడ్మిరల్ కాళిదాస్, శ్రీనివాస్, ఎస్.మానిక్ వాసగం, డాక్టర్ మను కొరుళ్ల, వేద వీర్ ఆర్యా, ఏయూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఐసీఏఐ సెమినార్

మద్దిలపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 29, 30న ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ చెప్పారు. పిఠాపురం కాలనీలోని ఐసీఏఐ భవనంలో ఆయన సెమినార్ బ్రోచర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సెమినార్‌లో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రినారా లోకేష్, ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నంద, సీఏ రేవతి, సుబ్బారావులు పాల్గొంటారని చెప్పారు. అర్థ సమృద్ధి ఎకానమీ ప్రాస్పరిటీ పేరుతో నిర్వహించే సెమినార్‌లో దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలు ఎటువంటి పాత్ర పోషిస్తున్నారో వక్తలు వివరిస్తారని తెలిపారు. అలాగే సీఏలో అవకాశాలు, ఆర్థిక పరమైన అంశాలను కూలంకుశంగా చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ వైజాగ్ బ్రాంచ్ చైర్మన్ అందవరపు శ్రీధర్, కార్యదర్శి రామునాయుడు, పట్నాల లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి పందిరిరాట



పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శనగర్ కాలనీ వాసులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పంతొమ్మిదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ రెండవ వీధిలో వినాయకచవితి ఉత్సవాల కోసం పందిరిరాట ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కాలనీ యువత, మహిళలు పాల్గొన్నారు. స్థానిక యంగ్‌స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువకులు ఈ నెల 27 నుంచి వినాయకచవితి నవరాత్రులు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా ఖేల్‌కూద్



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విశాలాక్షినగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా భారతీ రాష్ట్ర ఖేల్‌కూద్ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బీవీకే పాఠశాలలో బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచి ఐదు సమితుల విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకులు కె.కృష్ణమోహనరావు, కేఆర్కే సత్యనారాయణ, కె. చక్రవర్తి, కేవీ ఆనందం పర్యవేక్షించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

రోజు వ్యవధిలోనే చోరీ బైకులు అప్పగింత

పెందుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం బైకులు చోరీకి గురయ్యాయి. తక్కువ సమయంలోనే వాటిని గుర్తించి యజమానులకు అప్పగించినట్టు ఎస్ఐ సూరిబాబు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఇబ్బందులు తొలగిస్తానని గణబాబు హామీ

మర్రిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 57వ వార్డు మర్రిపాలెం శ్యామ్‌నగర్‌కాలనీలో సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. రెండు రోజుల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వార్డు పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు, గెడ్డలను ఆనుకొని ఉన్న కాలనీల్లో ఆయన పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్యామ్‌కాలనీలో గెడ్డల్లో పారుతున్న వర్షంనీరు కాలనీ ప్రధాన రహదారిలో భారీ ఎత్తున చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు తెలియజేయడంతో వెంటనే వర్షంనీరు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండంతో కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయా కాలనీలవాసులకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట ఆజయ్‌బాబు, ముదపాక శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్యామ్‌నగర్‌కాలనీ గెడ్డ ప్రాంతం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విద్యుత్ తీగలపై కూలిన చెట్టు

అక్కయ్యపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా గ్రేటర్ 26వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులోని సత్యసాయి మందిరం లైన్‌లో భారీ చెట్టు విద్యుత్ తీగలపై, ఇంటికి అడ్డంగా రోడ్డుపై కూలిపోయి పడింది. స్థానికుల సమాచారం మేరకు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ వచ్చి పరిశీలించారు. వెంటనే ఉద్యానవన శాఖ విభాగం ఏఈ వెంకటరమణ బృందాన్ని పంపించి చెట్టును నరికించి తొలగించారు. అలాగే సచివాలయం సెక్రటరీ లావణ్య సలహా మేరకు జీవీఎంసీ ఏఎంహెచ్‌వో ప్రసాద్‌కి ఫోన్ చేసి జేసీబీ పంపాలని కోరారు. అధికారుల సహకారంతో చెట్టును తొలగించి రోడ్డును శుభ్రం చేయించారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును కోస్తున్న సిబ్బంది

బురదలో అడుగెయ్యాల్సిందే..!



గురుద్వార బస్‌బే వద్ద రహదారిపై రాళ్లు తేలి, గోతిలో నిలిచిన వర్షపు నీరు

సీతంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా..ఎంతో ఖర్చుతో నిర్మించిన బస్ బేలు అధ్వానంగా మారాయి. బస్సులు నిలిపే చోట రహదారి అంతా రాళ్లు తేలాయి. పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. దీంతో ఆ గొయ్యిల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. బస్ బే స్టాప్‌లో ప్రయాణికులు నిరీక్షించేచోట ఫ్యాన్లు లేవు. రాళ్లు తేలిన రహదారిలో ప్రయాణికులు నడిచి వెళ్లి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సులు కూడా వర్షపు నీటిలో వస్తుండటంతో ప్రయాణికులపై బురద వెదజల్లుతుంది. బస్సు ఎక్కాల్సిన ప్రయాణికులు బురదలో అడుగేసి రావాల్సి ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సు స్టాప్‌ల వద్ద రహదారిని బాగుచేయాలని, కనీస వసతులు కల్పించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

అభాగ్యులకు షెల్టర్



అభాగ్యులను తరలిస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డు నెరెళ్ల కోనేరు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా రోడ్డుపై ఉంటున్న అభాగ్యులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దిక్కు తోచని స్థితిలో ఉండడంతో స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు స్పందించి డే అండ్ నైట్ షెల్టర్ కార్యదర్శి సహకారంతో పెందుర్తిలోని లయోలో అనాథ ఆశ్రమంలో చేర్పించారు.కార్పొరేటర్ స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బుజ్జి, బాబులు, శ్రీను, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసురు

... 5వ పేజీ తరువాయి

ఏడాది రుతుపవనాల ప్రవేశం తరువాత మూడు రోజులు వర్షాలు కురవడం ఇదే తొలిసారి. మోస్తరు నుంచి భారీవర్షాలు కురవడంతో జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు అనుకూల వాతావరణం ఏర్పడింది. చెరువులు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నగరంలో భూగర్భ జలాలు రీచార్జి కావడంతో బోర్లపై ఆధారపడేవారంతా ఊపిరిపీల్చుకున్నారు. వాయుగుండం నేపథ్యంలో మంగళవారం వరకు వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

సమన్వయంతో పనిచేద్దాం

... 5వ పేజీ తరువాయి

మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కలిసి పనిచేస్తున్నారని, అదే మాదిరిగా జిల్లాలో కూటమి పార్టీలకు చెందిన అందరం ఎప్పటికప్పుడు సమావేశమై ప్రతి అంశంపై చర్చించుకుని, ముందుకు వెళదామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎవరికైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతేతప్ప బహిరంగంగా ఎక్కడా వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒక సీటు కోల్పోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని సీట్లూ గెలుచుకునే బలం ఉన్నప్పుడు ఎందుకిలా జరిగిందని ప్రశ్నించారు. మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మధ్య సమన్వయం ఉంటే ఇలా జరిగేది కాదని కొందరు అన్నప్పుడు మంత్రి జోక్యం చేసుకుని భవిష్యత్తులో అటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. జీవీఎంసీలో మలేరియా విభాగంలో కాంట్రాక్టు పోస్టులను వైసీపీ కార్పొరేటర్లు చెప్పిన వారికే ఇస్తున్నారని ఒకరిద్దరు ఫిర్యాదు చేయగా, మేయర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీఆర్‌సీ సమావేశం త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. దానికి ముందు జిల్లాలో కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

గోతిలో కూరుకుపోయిన వ్యాన్



సీతమ్మధార, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ రోడ్డులో మంచి నీటి పైప లైన్ కోసం గోతులు తవ్వి పైపులు వేసి మట్టితో కప్పివేశారు. దీంతో ఆ గొయ్యిలో వర్షపు నీరు చేరడంతో మట్టి కిందికి దిగిపోయింది. గురుద్వార రహదారి నుంచి వస్తున్న మినీ వ్యాన్ రోడ్డు పక్కకు రావడంతో ఆ వ్యాన్ ముందు టైర్, వెనుక టైర్ రెండూ గోతిలో కూరుకుపోయాయి. దీంతో ఆ వాహనదారుడు ఇబ్బంది పడ్డారు. వ్యాన్‌లో ఉన్న లోడ్‌ను దించి గోతిలో నుంచి వాహనాన్ని బయటకు తీశారు.

నలుగురు ఎస్‌ఐల బదిలీ

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమీషనరేట్ పరిధిలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేసారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఉన్న తిరుపతిరావును భీమిలి ట్రాఫిక్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న సీహెచ్ చిరంజీవిని ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. ఎంవీపీ ట్రాఫిక్ విభాగానికి చెందిన వి.కనకారావును ఆరిలోవ ట్రాఫిక్ విభాగానికి, వీఆర్‌లో ఉన్న ఎల్.మురళీకృష్ణను సీసీఆర్‌బీకి బదిలీ చేశారు. వెంటనే వెంటనే విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



దుర్గాగణపతి ఆలయం వద్ద రాట వేస్తున్న కార్పొరేటర్ గోవింద్, భక్తులు

సీతంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని రాట ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రాటను ఆలయ అర్చకులు నటరాజన్ మంత్రోచ్చారణతో ప్రతిష్ఠింపజేశారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు, ఆలయ ఈఓ రమాభాయి, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సినీ నటుడు సాయికుమార్‌కు కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం



సినీనటుడు సాయికుమార్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ కనకమహాలక్ష్మి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన శ్రావణ లక్ష్మి పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.

నిత్యాన్న పథకానికి విరాళం

సింహాచలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై కొలువైన శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామివారి నిత్యాన్న ప్రసాదానికి నగరానికి చెందిన నరిసిపురం మాధవరావు, రాధారాణి దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ పీఆర్‌వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో దాతలు నగదు చెల్లించి రసీదు పొందారు. దాతలకు ఆలయ సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ నిత్యాన్న ప్రసాదం బాండ్‌ను అందజేశారు. అనంతర దాతలు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రసాదాన్ని వారికి అందజేశారు.

డిజైన్ థింకింగ్ ద్వారా ఆకర్షణీయమైన బోధన

» కృష్ణా విశ్వవిద్యాలయ వీసీ డా.కె.రాంజీ » ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం

కంచరపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆమోదంతో సోమవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' ప్రధాన లక్ష్యంతో ఆన్‌లైన్ విధానంలో జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజులు జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.కె.రాంజీ, సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం.ఎ.వి.రామకృష్ణ అతిథులుగా హాజరై ప్రసంగించారు. డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను వీరు వివరించారు. అధ్యాపకులు బోధనలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించాలని కోరారు. భవిష్యత్‌లో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఎదగనున్నదన్నారు. ఫైనైట్ ఎలిమెంట్స్, ఫైనైట్ వాల్యూమ్, ఫైనైట్ డిఫరెన్స్ భవిష్యత్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో వినియోగంలోకి వస్తాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏపీలో 20 ప్రోగ్రామ్‌లలో ఎంపికైన కళాశాల కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కో-ఆర్డినేటర్ డా.సీహెచ్.రాజు, కో-కోఆర్డినేటర్ ఎం.భరణి, గౌరవ అతిథిగా డా.కె.నారాయణ రావు, ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్, డా.కె.వి.రమణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.కె.రాంజీ

ఫుట్‌బాల్ విజేతలు విశాఖ, సత్యసాయి



విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆతిథ్య విశాఖ, సత్యసాయి జిల్లా జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఇరుజట్లు అద్భుతంగా రాణించాయి. సోమవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. విశాఖ జట్టు కోచ్ ఎస్.గణేష్, సహాయ కోచ్ అజీజ్, మేనేజర్ రాజన్న, నిర్వాహక ప్రతినిధులు చినబాబు, చక్రవర్తి, ఎస్‌జీ.రామకృష్ణ, రాజారావు, త్రినాథరావు (బాబు), సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు ఉద్యోగాలు

కంచరపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులు ఐదుగురు రాజస్థాన్‌లోని కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ హెచ్‌పీసీఎల్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలిపారు. వీరి ప్రారంభ వార్షిక వేతనం రూ.9.62 లక్షలు అని పేర్కొన్నారు. సోమవారం వీరికి కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్స్) ఎం.ఎ.వి.రామకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కెమికల్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. పూర్వ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, సీనియర్ అధ్యాపకుడు ఎస్.వి.రమణ, పీపీ విభాగం ఇన్‌చార్జి డా.సముద్రాల ప్రశాంతి కుమారి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న డీడీ డా.రామకృష్ణ, ప్రిన్సిపాల్ కె.వి.రమణ

రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ కల్చరల్ కార్నివాల్



స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు అసోసియేషన్ ఆఫ్ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించిన 'సావన్ అయోర్-ఎ కల్చరల్ కార్నివాల్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సోలో నృత్యాలు, జానపద నృత్యాలు, మోనో యాక్టింగ్, సమూహ సృజనాత్మక ప్రదర్శనల పోటీల్లో 97 మంది ప్రాతినిధ్యం వహించి ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. డీఆర్ఎం మాట్లాడుతూ సంప్రదాయ, జానపద కళల్లో సృజనాత్మక ప్రతిభకు అద్దంపట్టే ఇటువంటి కల్చరల్ కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఈకార్వో ప్రతినిధులు మధుస్మిత సాహు, డాక్టర్ భాషిణి ప్రియాంక, వి.భవ్య, బిల్కిస్ బానో తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి చిత్తడిగా రైతు బజార్

సీతమ్మధార, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల జనం ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. చిరువ్యాపారులు, రైతు బజార్‌లో రైతులు కొనుగోలుదారులు రాకపోవడంతో డీలా పడ్డారు. సీతమ్మధార రైతు బజార్ వర్షపు నీరుతో చిత్తడి చిత్తడిగా మారింది. దీంతో కుండపూత వర్షం పడుతుండటంతో బజార్‌కి కొనుగోలుదారులు అతి తక్కువగా వచ్చారు. దీంతో రైతులు తెచ్చిన కూరగాయాలు అమ్ముడు కాలేదు. రైతులు తాము తెచ్చిన వాటినిక అమ్ముకోకపోవడంతో పాటు అసలు కొనుగోలుదారులు రాకపోవడంతో నిరసంతో స్టాల్స్‌లోనే పడుకున్నారు. పువ్వులు వ్యాపారులు, ఆకు కూరాల రైతులు తాము తెచ్చిన వాటికి వర్షపు నీటితో తడిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఏమీ చేయాలో తోచక స్టాల్స్‌లోనే ఉండిపోయారు. మరోవైపు రైతు బజార్‌లో వర్షపు నీరు ఎక్కడబడితే అక్కడే నిలువై ఉంది. రైతుబజార్ చివరి గేటు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో అటుగా కొనుగోలుదారులు నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయింది. రైతుబజార్‌లో చివర కొడుగుడ్లు అమ్మే స్టాల్ ప్రక్కన పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వ ఉండటంతో పాటు పెద్ద ఎత్తు చెత్త చెదరం నిలిచిపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. సమీపంలో ఉన్న రైతు స్టాల్స్ వారు వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడ్డారు.



సీతమ్మధార రైతుబజార్‌లో పేరుకుపోయిన చెత్తచెదారం

పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు



వినుతులు స్వీకరిస్తున్న జడ్సీ బి.రాము

జ్ఞానాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ప్రజల నుంచి 5 ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి సంబంధించి 2, యూసీడీ విభాగానికి 2,రెవెన్యూ 1 చొప్పున ఆర్జీలను స్వీకరించి .సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారం కొరకు అందజేశారు.ఈఈ ప్రసన్న,ఈఈ పద్మావతి,ఏపీడీ పుణ్యవతి,ఆర్ఓలు బాబురావు,రాజ్యలక్ష్మి,టీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

కొమ్మాది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఆయన పరదేశిపాలెం ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం-స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జర్మనీలో నర్సింగ్ వృత్తిలో ఉద్యోగాల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో మొదటిదశలో 75 మందికి శిక్షణ ఇవ్వనుండగా మొదటిరోజు 29 మంది ఆసక్తి చూపించారు. వీరందరికీ పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో 8 నెలలు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జర్మనీలో రెండున్నర లక్షల రూపాయల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి నిర్వహించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్, డైరెక్టర్ లావణ్యవేణి, జిల్లా కలెక్టర్ హరేంధర్ ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీ అగస్టిన్, ఎండీ గణేష్, సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఎస్టీ వెల్ఫేర్ అధికారి సురేష్, డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, వేదికపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

ఆర్ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

(5వ పేజీ తరువాయి)

ఈపీడీసీఎల్ అధికారులు ఇటీవల అక్కడి ఉద్యోగుల సర్వీసు రికార్డులు పరిశీలించారు. పదోన్నతులు పొందిన వారి అర్హతలను తనిఖీ చేశారు. సస్పెన్షన్‌లో ఉండగా పదోన్నతులు పొందారని, అదేవిధంగా పదోన్నతులు పొందడానికి నిర్ణీత సమయం ఉండగా, దానిని కూడా పాటించలేదనీ గుర్తించారు. ఆ విధంగా అధిక మొత్తాలు పొందుతున్న వారి జీతాలను జూలై నెల నుంచి తగ్గిస్తూ ఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ అధికంగా పొందిన జీతాలను ఎలా రికవరీ చేయాలా?...అని ఆలోచిస్తోంది. ఇలా ఒక్కొక్క బండారం బయట పడుతుండడంతో త్వరలో 51 విచారణతో నిధుల దుర్వినియోగం కూడా వెలుగులోకి వస్తుందని అక్రమార్కులు భయపడుతున్నారు. దీనిని అడ్డుకోవాలని యత్నిస్తున్నారు.

వినియోగదారుల పేరుతో హైకోర్టులో కేసు

సొసైటీలో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఐదుగురు (ఎం.పరదేశినాయుడు, ఆడారి ప్రసన్నరాణి, బొమ్మిశెట్టి సత్యవేణి, విల్లూరి శివకుమార్, బొక్కం కనకారావు) సాధారణ విద్యుత్ వినియోగదారుల్లా ఈ నెల 4వ తేదీన హైకోర్టులో పిటిషన్ వేశారు. అనకాపల్లి ఆర్ఈసీఎస్‌పై జరుగుతున్న 51 విచారణను నిలిపివేయాలని, దానిపై స్టే ఇవ్వాలని కేసు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనల ప్రకారం...ఏ ప్రభుత్వ సంస్థపై గాని, ఉద్యోగులపై గాని ఆరోపణలు వచ్చి ప్రభుత్వం విచారణ చేస్తుంటే...దానిని ఆపాలని కోర్టుకు వెళ్లే హక్కు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉండదు. ఆ విచారణను ఎదుర్కోవాలి. నివేదిక వచ్చాక చర్యలకు సిద్ధపడాలి. కానీ ఇక్కడ ఈ ఐదుగురు కూడా తాము ఉద్యోగులమని పిటిషన్‌లో పేర్కొనకుండా వాస్తవం దాచి పెట్టడం గమనార్హం. ఈ నెల 4వ తేదీన కేసు ఫైల్ కాగా ఆ విషయం వెంటనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంబంధిత అధికారులకు తెలియజేస్తారు. దానిపై కౌంటర్ వేయడానికి సమాచారం ఇవ్వాలని కోరతారు. ఆ వివరాలు ఆర్ఈసీఎస్‌కు రావాలి. దానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎండీగా అనకాపల్లి ఈపీడీసీఎల్ ఎస్ఈ వ్యవహరిస్తున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి 51 ఎంక్వయిరీకి అధికారిని నియమించారు. హైకోర్టులో కేసు వేసిన వారు ఎవరో ముందుగా చూడాలి. వారు ఇక్కడ పనిచేస్తున్న వారే కాబట్టి అది సర్వీసు రూల్స్‌కు వ్యతిరేకం అయినందున చర్యలు చేపట్టాలి. కానీ ఎవరూ తమకు హైకోర్టులో కేసు విషయం తెలియదని చెబుతున్నారు. ఆ కేసు వేసిన ఉద్యోగులను పిలిచి కనీస విచారణ కూడా చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా సహకార శాఖ అధికారులు మేల్కొంటారా? లేదో మరి.

ఉక్కు సెగలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపిస్తున్నాయి.

విభాగాల వారీగా ప్రైవేటీకరణ

ప్లాంటును ప్రైవేటీకరించబోమని ఒకవైపు చెబుతూనే మరో వైపు ఒక్కో విభాగాన్ని 'నిర్వహణ' పేరుతో ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి 'ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన' (ఈఓఐ)లు జారీచేస్తున్నారు. ముందు రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, ఆ తరువాత సింటర్ ప్లాంటు, ఆపై ఫైర్ డిపార్టుమెంట్, తాజాగా థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణకు ఈఓఐలు ఇచ్చారు. శనివారం రాత్రి ఏకంగా మరో 32 విభాగాలు ప్రైవేటుకు ఇస్తామని ఈఓఐలు జారీచేశారు. అంటే ప్లాంటులో దాదాపుగా 80 శాతం విభాగాలు ప్రైవేటుకు ఇవ్వడానికి సిద్ధమైనట్టు అర్థమవుతోంది. దీనిపై ఇప్పటివరకూ ఉద్యోగ సంఘాలతో గానీ, కార్మిక సంఘాలతో గానీ చర్చించలేదు. అంతా ఏకపక్షంగా సాగిపోతోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో విభాగాలన్నీ పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేసి, వేల సంఖ్యలో ఉన్న శాశ్వత ఉద్యోగులను వందల్లోకి తీసుకువచ్చి, వారిని పర్యవేక్షణకు ఉపయోగిస్తారని చెబుతున్నారు. దీనివల్ల నిర్వహణ వ్యయం తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని అంటున్నారు. చాప కింద నీరులా స్టీల్ ప్లాంటును క్రమంగా నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికే ఇవన్నీ చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రైవేటు నిర్వహణలో పనితీరు బాగా లేదని, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పి ఆ తరువాత ప్లాంటును అమ్మకానికి పెడతారని, అప్పుడు కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు విశాఖ స్టీల్‌ను ఎగరేసుకుపోతాయని, అదే వారి ప్రణాళిక అని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల సంఖ్య వేల నుంచి వందలకు తగ్గించడం వల్ల కార్మిక సంఘాలు బలహీనమవుతాయని, అప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా ఆందోళన చేయడం, అడ్డుపడడం తగ్గుతుందనేది యాజమాన్యం ఆలోచనగా భావిస్తున్నారు.

ఒకరికి భూములు...ఇంకొకరికి ప్లాంటు

స్టీల్‌ప్లాంటు భూములపై అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కన్ను పడిందంటున్నారు. పోర్టు విస్తరణకు కనీసం రెండు వేల ఎకరాలు అవసరమని, ప్రస్తుతం రైల్వే లైన్లకు కూడా భూములు కావాలని అడుగుతోందంటున్నారు. రెండు వారాల క్రితం రైల్వే అధికారులు వెళ్లి రైల్వే లైన్లకు అవసరమైన భూములు పరిశీలించారు. స్టీల్ ప్లాంటుకు ఏ విధంగాను సహకరించని అదానీ యాజమాన్యానికి భూములు ఎలా ఇస్తారని చాలాకాలంగా కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పుడు సంఘాలు ఆందోళన చేయకుండా ఆంక్షలు పెట్టారు. ప్రశ్నించే వారికి నోటీసులు ఇస్తున్నారు. ఏదో ఒకటి చేసి తొలుత అదానీకి అవసరమైన భూములు అప్పగిస్తారని, ఆ తరువాత పనితీరు ఆధారంగా ప్లాంటు విలువ తగ్గేలా చేసి...తక్కువ ధరకు జిందాల్ స్టీల్‌కు అప్పగిస్తారని, దాని కోసం ప్రణాళిక ప్రకారం ఇవన్నీ చేస్తున్నారని ఉక్కు కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.


ఛిద్రంగా మారిన ఆటోనగర్-విశ్వేశ్వరాయ నగర్ రోడ్డు


వడ్లపూడిలో కోతకు గురైన రహదారి


వర్షాలకు ధ్వంసమైన శ్రీరామ్ నగర్ కొండపై గల రోడ్డు

నరకప్రాయంగా రహదారులు

వర్షాలతో ఛిద్రంగా మారిన వైనం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న 71, 87 వార్డుల ప్రజలు

ఆటోనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెరిపివ్వకుండా రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లోని రహదారులు ఛిద్రంగా మారాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 71వ వార్డు పరిధి ఎల్వీ నగర్, ఆటోనగర్, విశ్వేశ్వరాయ నగర్‌కు చెందిన రోడ్లు రాళ్లుతేలి దారుణంగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నానాపాట్లు పడుతున్నారు. అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడి ప్రధాన రహదారిలో పలుచోట్ల రోడ్డు కోతకు గురై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఆయా గోతుల్లో పెద్దఎత్తున నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని ఈ రోడ్లు కూటమి ప్రభుత్వ పాలనలోనైనా బాగుపడతాయని స్థానికులు ఆశిస్తున్నారు. ఇక్కడి రహదారులపై గత భారీ గోతులను పూడ్చేందుకు లేదా నూతనంగా రోడ్లు వేసేందుకు కూటమి నేతలు, అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన శ్రీరామ్‌నగర్ కొండ రోడ్డు

గ్రేటర్ 71వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లే కొండవాలు రోడ్డు కోతకు గురవ్వడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. భారీ వర్షాలకు కొండపై గల మట్టి కరుగుతుందని, అందువల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

నీట మునిగిన పాలవలస

ఉక్కుటౌన్‌షిప్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 77వ వార్డు శివారు ప్రాంతమైన పాలవలస గ్రామం నీట మునిగింది. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు నీరు బయటకు పోయే అవకాశం లేకపోవడంతో గ్రామం నీట మునిగింది. ఆదివారం రాత్రికి గ్రామంలో కొద్దిపాటి నీరు ఉండగా, సోమవారం ఉదయానికి గ్రామమంతా నీరు చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక నాయకులు స్పందించి ఎక్స్‌కవేటర్ల సాయంతో వర్షపు నీరు బయటకు పోయేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రానికి నీరు తగ్గుముఖం పట్టింది.


వాన నీటిలో పాలవలస గ్రామం

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. విశాఖ విమల విద్యాలయం రోడ్డుపై మోకాల్లోతు వరకు నీరు నిలిచింది. ఇక్కడ కల్వర్టుకు అడ్డంగా ఓ చెట్టు పడిపోవడంతో వర్షపు నీరు దిగువకు పోలేక రోడ్డుపై ప్రవహించింది. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఫిర్యాదుతో జీవీఎంసీ అధికారులు స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్టును తొలగించారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి బీసీ రోడ్డుకు వెళ్లే మార్గం నీట మునిగింది. పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారిపై పెద్దఎత్తున నీరు ప్రవ హించడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.


కల్వర్టుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

రక్తదాన శిబిరం కరపత్రాల ఆవిష్కరణ

అగనంపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో దివ్యజ్యోతి భవనం వద్ద ఈ నెల 23న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలను పల్లా కొనియాడారు. ప్రతిఒక్కరూ అపోహలను వీడి రక్తదాన చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామకోటి, రాజు, రాము, బి.సత్యనారాయణ, బుజ్జి, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్ హరిబాబును కలిసిన మురళీకృష్ణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీకి చెందిన లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ ఎంవీ మురళీకృష్ణ సోమవారం ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును భువనేశ్వర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మురళీకృష్ణ ఒడిశా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు కోచింగ్ డెవలప్‌మెంట్ బోర్డులో పనిచేస్తున్నారు. సెప్టెంబరు 4 నుంచి 7వ తేదీ వరకు టాటానగర్‌లో జరగనున్న ఈస్ట్ జోన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న ఒడిశా జట్టుకు శిక్షణనిచ్చేందుకు గాను ఆయన భువనేశ్వర్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కంభంపాటి హరిబాబును కలిసి ఒడిశా బాడ్మింటన్ టీమ్‌కు ఇచ్చే శిక్షణ అంశాలను వివరించారు.


కంభంపాటి హరిబాబుతో మాట్లాడుతున్న మురళీకృష్ణ

రహదారి నిబంధనలను పాటించాలి: సీఐ వెంకటరావు

అగనంపూడి, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): రహదారి భద్రతా నిబంధన లను అందరూ తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు విద్యార్థులకు సూచించారు. రహదారి భద్రత, యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోవద్దన్నారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదన రావు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో గల శ్రీనూకాంబిక ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించి అభిషేకాలు, పసుపుకుంకుమ పూజలు చేశారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, వైసీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంవీవీటీ ఆచారి, సీహెచ్ మురళీమోహన్, రెడ్డిపల్లి ఆనంద్, పి.అప్పారావు, జి.కామేశ్వరరావు, టి.వీరబాబు, కాశీవిశ్వేశ్వరరావు, తేజ, తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకున్న నూకాంబిక

ఉప ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఇక్కడి శ్రీపెంటమాంబ ఆలయ ఆవరణలోని శ్రీమహాశక్తి, భూలోకమాంబ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయాల పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ డైరెక్టర్లు, నెల్లిముక్కు పంచాయతీ పెద్దలు సామూహిక శంకుస్థాపనలు చేశారు. ముందుగా శ్రీపెంటమాంబకు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, జి.అప్పలరెడ్డి, వై.శ్రీనివాసరావు, జి.సత్యారావు, పైడిరాజు, రమణ, కుంచా రావు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య సమస్య నుంచి కాపాడాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జల, వాయు కాలుష్యంతో పాటు ప్రమాదకర పదార్థాలను నిల్వ చేసే గొడౌన్ల నుంచి 68వ వార్డు పరిధిలోని కాలనీలను రక్షించాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావు, గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్‌లకు స్థానిక అఖిలపక్ష కమిటీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలోని మింది, అక్కిరెడ్డిపాలెం, గుడివాడ అప్పన్నకాలనీ, రామ్‌నగర్ కాలనీల ప్రజలు ఇప్పటికే విశాఖ డెయిరీ, కోరమాండల్ వంటి పరిశ్రమల నుంచి వెలువడే జల, వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికితోడు ఇప్పుడు విశాఖ పోర్టుకు చెందిన స్థలంలో ప్రమాదకర రసాయనాలు, ఇతర పదార్థాలను నిల్వ చేసేందుకు సాన్వీర వంటి సంస్థలు గొడౌన్ల నిర్మాణానికి అనుమతులివ్వడం సరికాదన్నారు. బఫర్ జోన్ నిబంధనల ప్రకారం జనావాసాలకు 500 మీటర్ల దూరంలో వీటిని నిర్మించాలని పేర్కొన్నారు. మేయర్, కమిషనర్‌లను కలిసిన వారిలో నాయకులు గుడివాడ లతీశ్, పి.చిన్నారావు, జి.మూర్తి, రామ్మోహన్, మురళీ, తదితరులు ఉన్నారు.


మేయర్, కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న దృశ్యం

36 అడుగుల దుర్గాదేవి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ


గాజువాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి దుర్గానగర్ కొండపై గల దుర్గాదేవి ఆలయ సన్నిధిలో 36 అడుగుల దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సోమవారం భూమి పూజ చేశారు. దేశంలోనే అతిపెద్దదిగా ఇక్కడ 36 అడుగుల దుర్గాదేవి విగ్రహం ఏర్పాటు చేయనుండడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఆకుల అప్పల సూరి, రాయుడు, వెంకటేశ్వరరావు, జ్యోతి, అప్పలకొండ, మంగమ్మ, వాసుదేవరెడ్డి, తిరుపతిరావు, అసిరమ్మ, గౌరీ ప్రసాదరావు, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఈవోఐలపై కార్మిక వర్గం ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కీలక విభాగాలపై ఈవోఐను యాజమాన్యం విడుదల చేయడంతో కార్మికులంతా ఆందోళన చెందుతున్నారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు మంత్రిత్వశాఖ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముదుఉ కార్మిక వర్గంతో చర్చించాలన్నారు. ఇటువంటి నిర్ణయాల వల్ల వలన కార్మిక వర్గంలో అసంతృప్తి, అస్థిరత పెరుగుతుందని పేర్కొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట

అగనంపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ జాబిలి హిల్స్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం వేదపండితులతో రాట వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గొల్లవిల్లి వెంకటరావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


నీటితో కళకళలాడుతున్న పెందుర్తి చెరువు

నిండుకుండల్లా చెరువులు

పెందుర్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా స్థానిక చెరువులకు జలకళ సంతరించుకుంది. వారం క్రితం 50 శాతం వరకు చెరువుల్లో నీరు లేదు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు 70 శాతం పైగా నీరు చేరి చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో పాత పెందుర్తి, సరిపల్లి, ముదపాక, పినగాడి, రాంపురం, ఎస్ఆర్‌పురం, రాజయ్యపేట, గొరపల్లి గ్రామాల్లోని చెరువులు నిండాయి. చెరువుల పూడికలు తీయకపోవడం, చెక్‌డ్యాంలు నిర్మించకపోవడంతో వచ్చిన వర్షం నీరు వృథా అవుతోందని, దీంతో చెరువుల నుంచి పంటలకు సాగు నీరందక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగైతే ఎప్పటికైనా ప్రమాదమే..

మల్కాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో 59వ వార్డు హనుమాన్ నగర్ కొండ ప్రమాదకరంగా తయారైంది. వర్షాల కారణంగా కొండ నానిపోయి ఏ క్షణంలో మట్టి జారిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తహశీల్దార్ రమేశ్ కొండ దిగువన ఉన్నవారిని ఇళ్లు ఖాళీ చేయాలని సూచించారు. ఇంతక ముందు ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ప్రతిపాదనలు వచ్చినా కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. వర్షాలు తగ్గిన వెంటనే రక్షణ గోడ నిర్మించే విధంగా స్థానిక కార్పొరేటర్లు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు

వేపగుంట ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 95వ వార్డు లక్ష్మీపురం ఏరియాలోని పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, కృష్ణరాయపురంలో యూజీడీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ లేఅవుట్‌లో మంచినీటి సరఫరాకు కొత్తపైపులైన్లు వేయాలని ఫిర్యాదులు అందాయి. అలాగే 96వ వార్డు సుజాతనగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా యూజీడీ పైపులైన్ లీకేజీని నిలుపుదల చేయాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపడతామని జడ్సీ కె.హైమావతి తెలిపారు.

అభివృద్ధికి పరిశోధనలు మూలం

-డీఆర్‌డీవో కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్

విశాఖపట్నం, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): సైన్స్‌లో జరిగిన పరిశోధనా ఫలితాలు నేడు ప్రపంచాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్ పేర్కొన్నారు. సోమవారం ఆర్కే బీచ్ వద్ద ఆంధ్రా విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు చేపట్టే వారికి సాంకేతిక పరికరాల వినియోగంపై తప్పనిసరిగా అవగాహన ఉన్నప్పుడే పరిశోధన ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. సైన్స్ వైపు యువత దృష్టి సారించేలా వారి ఆలోచనలో మార్పు వచ్చే విధంగా బోధనా సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీవో అనేక ప్రయోగ శాలలను కలిగి ఉందని, ఇవి రక్షణ సాంకేతిక రంగాలలో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఏరోనాటిక్స్, ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ వంటి సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తున్నాయన్నారు. అత్యంత కీలకమైన రక్షణ, సాంకేతిక వ్యవస్థల్లో స్వయం సమృద్ధిని సాధించడం చాలా ప్రాముఖ్యమన్నారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆర్వీఎస్ ప్రసాద్, వైస్ అడ్మిరల్ కాళిదాస్, శ్రీనివాస్, ఎస్.మానిక్ వాసగం, డాక్టర్ మను కొరుళ్ల, వేదవీర్ ఆర్యా, ఏయూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలు పు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 30, ఆనపకాయ18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారె ట్ 46, దొండకాయలు 20, బంగాళదుంప లు 18, అరటికాయ (పె)10, మునక్కాడ లు (కిలో) 34, అల్లం(పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కి లో) 64, బద్దచిక్కుడు 50, దోసకాయలు 30, వెల్లుల్లి(పెద్దవి) 75, కొబ్బరికాయ (పె ద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 64, గోరు చి క్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన(కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మా మిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


56వ వార్డు చాకలిగెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు


పెందుర్తి రహదారిపై నిలిచిపోయిన నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఆర్పీపేట(కంచరపాలెం)/ ఎన్ఏడీ జంక్షన్ ఆగస్టు 18,(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56, 57వార్డులలో వర్ష ప్రభావిత గ్రామాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం పర్యటించారు. చాకలిగెడ్డ, దయానందనగర్, రాజీవ్‌కాలనీ, ఆశవానిపాలెం గ్రామాల్లో ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. కాలువలోని మురుగు సజావుగా వెళ్లేటట్టు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, పెంటకోట అజయ్‌బాబు, జీవీఎంసీ జడ్సీ రాము, తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 90వ వార్డు కొండవాలు ప్రాంతాలను వర్షంలోనే తడుస్తూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో చాలా వరకు రక్షణ గోడల నిర్మాణం చేపట్టడంతో ప్రమాదం ఏమీ జరగలేదు. కొండకు దగ్గరలో ఉన్న కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నిలిచిన నీరు

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో హెచ్‌పీసీఎల్ ప్రధాన ద్వారం వద్ద నీరు నిలవ ఉండిపోయింది. దీంతో రిఫైనరీ ఉద్యోగులు, అధికారులు, తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. మల్కాపురం ప్రధాన రహదారి నిర్మాణం సమయంలో ఇంజనీరింగ్ సిబ్బంది డ్రైనేజీ వ్యవస్థను రోడ్డుకు తగ్గట్టు నిర్మించకపోవడం వల్ల గేటు వద్ద నీరు నిలిచిపోతోంది. ఇప్పటికైన అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని కోరుతున్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్న తహశీల్దార్

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. దీంతో గుర్రమ్మపాలెంలోని జగనన్న కాలనీలోని వర్షపు నీరు నిలవ ఉండిపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. జుత్తాడలోని జగనన్న కాలనీ రోడ్డు బురద మయంగా మారింది. చినముషిడివాడలోని ఉడా కాలనీ, కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్, చాణక్యనగర్, క్రాంతినగర్ నగర్, సుజాత నగర్, పెందుర్తిలోని వెలంపేట, గొర్లెవానిపాలె ప్రాంతాలు బురదమయంగా మారాయి. పెందుర్తిలోని నాలుగు రోడ్ల కూడలి జలమయం అయ్యింది. 124.8 వర్షపాతం నమోదు అయ్యిందని తహశీల్దార్ వెంకట అప్పారావు తెలిపారు. ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో రెవెన్యూ సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. నేషనల్ ఎక్స్‌ప్రెస్ ఆరు లైన్ల రహదారి వానొస్తే చెరువులా మారుతోంది. ఎడతెరిపి లేకుండా మూడు రోజులగా వర్షం పడుతుండడంతో రహదారిపై నీరు నిలిచిపోతోంది దీంతో వేగంగా వెళ్లే వాహనాలకు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నది. రోడ్డు మీద నిలిచిన నీరును ట్రాఫిక్ పోలీసులు ఊడ్చుతున్నారు. జాతీయ రహదారి అధికారులు కనీసం పట్టింపు చర్యలు తీసుకోవడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపాలెం ప్రాంతం జలమయం

గోపాలపట్నం (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 89వ వార్డు కొత్తపాలెం గ్రామంలో లోతట్టు ప్రాంతం జలమయం అయ్యింది. కొండవాలు ప్రాంతం, వేపగుంట పరిసర ప్రాంతాల్లోని గెడ్డల నుంచి వచ్చే వరదనీరు కొత్తపాలెం శివారు ప్రాంతంలో వరద నీరు చేరింది. ఈ ప్రాంతంలో గెడ్డలు ఆధునీకరణ చేయకపోవడంతో ఏటా వర్షాకాలంలో ముంపు బాధ తప్పడం లేదు. ఈ ఏడాదిలో కొద్ది నెలల క్రితమే ఈ ప్రాంతంలో గెడ్డలు, పంట కాలువలను వెడల్పు చేశారు. అయినా వరదముంపు తప్పలేదు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ దాడి వెంటకరమేశ్ ఈ ప్రాంతంలో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.


చెరువును తలపిస్తున్న కొత్తపాలెం ప్రాంతం

రోజు వ్యవధిలోనే చోరీ బైకుల అప్పగింత

పెందుర్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెందుర్తి పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులు చోరీకి గురయ్యాయి. తక్కువ సమయంలోనే వాటిని గుర్తించి యజమానులకు అప్పగించామని ఎస్ఐ సూరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం సోమవారం పురుషోత్తపురం, పెందుర్తిలో పార్కింగ్ చేసిన మూడు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో సీసీ పుటేజీల ఆధరంగా దుండగులను గుర్తించారు. ఈ క్రమంలో చోరీ జరిగిన ద్విచక్రవాహనాలను యజమానులకు అప్పగించారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉక్కు ఉద్యోగులకు 330 శాతం వేతన బకాయిలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఇప్పటివరకు 330 శాతం వేతనం పెండింగ్‌లో ఉంది. గత ఏడాది సెప్టెంబరులో 50 శాతం, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో 35 శాతం చొప్పున, ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 25 శాతం చొప్పున వేతనం పెండింగ్‌లో ఉంది. ఇలా మొత్తం 330 శాతం వేతనం పెండింగ్‌లో ఉందని, ప్లాంటులో పూర్తి స్థాయి వేతనం తీసుకుని ఏడాది అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెదిరిపోని జ్ఞాపకం

- వెయ్యి అక్షరాల భావనకు ప్రతిరూపం ఫొటో
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


హంసల ప్రేమాయణం

వెయ్యి అక్షరాలు కూడా చెప్పలేని భావనను ఫొటో చెబుతుంది. కాలగర్భంలో కలిసిపోయిన విషయాలకు ఫొటోలు జీవం పోస్తాయి. ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ అంటే సందర్భాన్ని బట్టి ఫొటో తీయడం, దానికి క్రియేటివిటీ జోడించడం. అనంత సమాచారాన్ని అందించే ఫొటోను తీయగలిగితేనే పరిణితి చెందిన ఫొటోగ్రాఫర్‌గా రాణించినట్టు లెక్క

ఫొటో అంటే చిత్రం. గ్రఫీ అంటే గీయడం. 1861కు ముందు బ్లాక్‌అండ్‌వైట్ ఫొటోలు ఉండేవి. 1936లో ఆల్ఫా కలర్‌ఫిలిం తయారీలో సాంకేతికతను వినియోగించి, సులభతరం చేశారు. 1969 నుంచి పూర్తిస్థాయి కలర్ ప్రింట్ కలిగిన కెమెరాలు వచ్చాయి. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఫొటోగ్రఫీపై పేటెంట్ హక్కులను కొనుగోలు చేసి, ప్రపంచానికి బహుమతిగా అందించింది. అందుకే ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ డేగా జరుపుకుంటారు. ఫొటోలు తీయాలన్నా, నేర్చుకోవాలన్నా విశాఖను మించిన ప్రాంతం లేదు. భిన్న సంస్కృతుల కలయిక, విశాల సాగరతీరం, జాలర్ల జీవనం, గిరుల అందాలు, మురికివాడల జీవితం, ఆకాశహర్మ్యాలు, పరిశ్రమలు, పర్యాటకం, ఉత్సవాలు, వినోదాలు ఇలా ఎన్నో. ఔత్సాహికులు, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లకు విశాఖ విందు భోజనం.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


పులుల ముచ్చట్లు


మత్స్యకారుల జీవన విధానానికి దర్పణం ఈ చిత్రం


ఫైరింజన్లతో జాతీయ పతాకం రంగులను వెదజల్లుతూ...

వాన బీభత్సం

అల్పపీడనం ప్రభావంతో సోమవారం నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మురుగుకాల్వలు, గెడ్డలు పొంగాయి. పూర్ణామార్కెట్ పరిధి వెలంపేట, కల్లుపాకలు, రామకృష్ణా జంక్షన్, కొబ్బరితోట, చిలకపేటలో రోడ్లపై నీరు ప్రవహించింది. కొండవాలు ప్రాంత వాసులు భయం గుప్పిట్లో ఉన్నారు. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. బీచ్‌రోడ్డులో రక్షణ గోడ కూలిపోయింది. సుజాతనగర్ రోడ్డుపై గొయ్యిలో లారీ కూరుకుపోయింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


పూర్ణా మార్కెట్ మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


హనుమంతువాకలో కూలిపోయే దశలో ఇళ్లు


తోటగరువు కొండపై జారిపడిన మట్టిపెళ్లలు


సుజాతనగర్ జంక్షన్ వద్ద కూరుకుపోయిన లారీ


సింహగిరిపై భారీ వర్షం


వెలంపేట ప్రాంతంలో నిలిచిన వరద నీటిలో స్థానికుల రాకపోకలు

పర్యాటకానికి కేంద్ర బిందువుగా విశాఖ

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వీరాంజనేయ స్వామి

యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

కైలాసగిరిపై త్రిశూలం ఏర్పాటుకు శంకుస్థాపన

విశాలాక్షినగర్/ ఎండాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నాన్ని పర్యాటకానికి కేంద్ర బిందువుగా మార్చేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. కైలాసగిరిపై రూ.1.55 కోట్లతో ఏర్పాటు చేయనున్న త్రిశూలం, ఢమురకం పనులకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా త్రిశూలం, ఢమురకం నమూనాను ప్రదర్శించారు. ఆ తరువాత బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వద్ద రూ.3.5 కోట్లతో నిర్మించిన యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసగిరిపై పర్యాటకులను ఆకర్షించేందుకు అనేక కొత్త ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖను పర్యాటకంలో అగ్రగామిగా ఉంచాలని ఆదేశించారన్నారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కైలాసగిరిపై త్వరలో అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్రిశూలం, ఢమురకం రాత్రి వేళల్లో వెలుగులు విరజిమ్ముతాయని, కైలాసగిరిని ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయరు పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, చీఫ్ ఇంజనీర్ వినయకుమార్, ఎస్‌ఈలు భవానీ శంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.


హెలికాప్టర్ మ్యూజియంలో కూర్చున్న మంత్రులు డోలా, అనిత, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు


త్రిశూలం ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు డోలా, అనిత, మేయర్ పీలా, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ, తదితరులు

కలెక్టరేట్‌లో 173 వినతుల స్వీకరణ

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారమే ధ్యేయంగా అధికారులుకృషిచేయాలని కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి 173 వినతులు స్వీకరించారు.రెవెన్యూ విభాగానికి 66, జీవీఎంసీ 50, పోలీసు 10, ఇతర విభాగాల నుంచి 47 అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై మార్గదర్శకాలు జారీచేశారు అర్జీలలోని అంశాల పూర్వాపరాలు తెలుసుకొని పదేపదే వచ్చే వినతులను లోతుగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్ర సమాచారం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 54 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 54 వినతులు వచ్చాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ స్వీకరించారు. నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో 121 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- గీతకులాలకు పది బార్లు రిజర్వు
- ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు
- ఎక్సైజ్‌శాఖ డీసీ శ్రీరామమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్

సిరిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 121 బార్లకు జనరల్, మరో 10 బార్లకు గీతకులాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ నెల 18న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని, 26న సాయంత్రం 5 గంటల వరకు గడువుందన్నారు. ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా బార్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చుని, రూ.5 లక్షల దరఖాస్తు ఫీజుతో పాటు రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని, ఇది నాన్ రిఫండబుల్ అని తెలిపారు. గీతకులాల సంక్షేమం కోరుతూ ప్రభుత్వం ఆరు శెట్టిబలిజ, నాలుగు బార్లను యాత కులాలకు కేటాయించిందన్నారు. శ్లాబ్ 50 వేలజనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి ఐదు లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షలకు పైగా ఉంటే రూ.75 లక్షలు చెల్లించాలన్నారు. గతంతో పోలిస్తే దరఖాస్తు ధరను ప్రభుత్వం తగ్గించిందని స్పష్టం చేశారు. ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ గీత కులాల వారు ఒక బారుకు ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేయాలని వీరికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. నెల 20న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. 29న సాయంత్రం ఐదు గంటలకు గడువు ముగుస్తుందని, 30న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. ప్రస్తుతం బార్ల వేళలు ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు ఉన్నాయని, లాటరీ తరువాత ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు నేరుగా సంప్రదించాలన్నారు. వివరాలకు https/oc.hpfsproject.comను సంప్రదించాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీ, సూపరింటెండెంట్


నవంబరు 30న వైజాగ్ మారథాన్

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబరు 30న వైజాగ్ మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం నోవాటెల్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోస్టర్‌ను ఆవిష్కరించారు. నవంబరు 30న బీచ్‌రోడ్డులో నిర్వహించే సంధ్యామెరైన్స్ 4వ ఎడిషన్ వైజాగ్ మారథాన్‌లో 32కె, 21కె, 10కె, 5కె ఉంటాయన్నారు. విజేతలకు రూ.10 లక్షల ప్రోత్సాహకం అందిస్తామన్నారు. మారథాన్ ద్వారా నగరవాసులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నందుకు సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణరాయ్, కె.ఆనంద, ప్రభుకిశోర్, డా.రాధిక తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ బాగ్చి, తదితరులు

ముడసర్లోవ, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్లకు జల కళ


ముడసర్లోవ రిజర్వాయర్‌లో నీరు


నీటితో కళకళలాడుతున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

గోపాలపట్నం/ఆరిలోవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ రిజర్వాయర్లు జల కళను సంతరించుకున్నాయి. మేహాద్రిగెడ్డలో నీటిమట్టం 54 అడుగులకు చేరింది. గరిష్ట నీటిమట్టం 61 అడుగులు కాగా, గత నెల 49 అడుగులు ఉండేది. ఎగువన భారీ వర్షాలు కురవడంతో వరదనీరు చేరింది. దీంతో ఆదివారం సాయంత్రం వరకూ 50 అడుగులున్న నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 54 అడుగులకు చేరింది. 59 అడుగులకు సమీపిస్తే దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. కాగా ముడసర్లోవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 170 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 159.5 అడుగులకు చేరినట్టు వాటర్ వర్క్స్ ఏఈ సురేశ్ తెలిపారు.

క్రైం... crime news

పేలుడు ఘటనలో ఆరో వ్యక్తి మృతి

మహారాణిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న ఆరో వ్యక్తి సన్యాసిరావు కూడా మృతి చెందాడు. దీంతో ఈ ఘటనలో మొత్తం ఆరుగురూ మృతిచెందారు. ఇటీవల హార్బర్ సమీపంలోని వెల్డింగ్ షాపులో పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సన్యాసిరావు సోమవారం ఉదయం మృతిచెందాడు. గాయపడిన వారిలో ఇద్దరు కేజీహెచ్‌లో గత రెండు రోజుల్లో వరుసగా మృతిచెందిన విషయం తెలిసిందే.

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం సముద్రంలో వల వేసిన ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాలారి ఎండాడకు చెందిన పిల్లా సతీష్ (24) సోమవారం ఉదయం వేటకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు కలవరపడ్డారు. వల వేస్తుండగా పెద్దకెరటం రావడంతో కొట్టుకుపోయాడని అక్కడి సమీపంలోని వారు తెలిపారు. దీంతో తండ్రి వీర్రాజు, బంధువులు తీరంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పది కేజీల గంజాయితో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.53 వేల విలువైన 10.6 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన నిరంజన్ బిన్ (37), మధ్యప్రదేశ్‌కు చెందిన హరీష్ తివారి (19)లు రైల్లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో చోరీకి పాల్పడిన నిందితుడిని క్రైం పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీసీపీ (క్రైం) కె.లతామాధురి, సౌత్ సబ్ డివిజన్ సీఐ కె.శ్రీనివాసరావు వివరాలు తెలిపారు. టౌన్‌షిప్‌లోని డీజీఎం నల్లి సుందరం ఇంట్లో శనివారం చోరీ జరిగింది. 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతికతను వినియోగించి అగనంపూడి ప్రాంతానికి చెందిన మాటూరి శ్రీను (24) చోరీ చేసినట్టు గుర్తించారు. అతడి నుంచి 24 తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇతడు పాత నేరస్థుడని పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లతామాధురి

ఆల్ ఇండియా లిబరల్ పార్టీకి షోకాజ్ నోటీస్

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘంలో రిజిస్టరై గత ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లోనూ పోటీచేయని గుర్తింపులేని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీచేసిందని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆలిండియా లిబరల్ పార్టీకి నోటీస్ జారీచేశామన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి ఎవరైనా వచ్చేనెల ఎనిమిదోతేదీలోగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎదుట హాజరై, అన్ని ఆధారాలతో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం-డొంకినవలస నడుమ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు పలు రైళ్లను రద్దుచేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కొన్ని రైళ్ల గమ్యాలను కుదించామని, మరిన్ని రీ షెడ్యూల్ చేశామన్నారు.

రద్దయిన రైళ్లు: ఈనెల 19 నుంచి 27 వరకు విశాఖ-రాయ్‌పూర్ (58528), విశాఖ-కోరాపుట్ (58538), విశాఖ-భవానీపట్న (58504). 20 నుంచి 28 వరకు రాయ్‌పూర్-విశాఖ (58527), కోరాపుట్-విశాఖ (58537), భవానీపట్న-విశాఖ పాసింజర్లు (58503).

రీ షెడ్యూల్: ఈ నెల 22 నుంచి 27 వరకు విశాఖ-దుర్గ్ వందేభారత్ (20830 రెండున్నర గంటలు ఆలస్యంగా, దుర్గ్-విశాఖ వందేభారత్ (20829) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరతాయి. ఉదయం 9.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-నిజాముద్దీన్ సమతా (12807) ఈ నెల 20, 21, 23, 24, 26 తేదీల్లో మధ్యాహ్నం 2.20కు బయలుదేరుతుంది.

గమ్యం కుదింపు: ఈ నెల 19 నుంచి 26 వరకు గుంటూరు-రాయగడ, 20 నుంచి 27 వరకు విజయనగరం-గుంటూరు మధ్య రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. విజయనగరం-రాయగడ మధ్య రాకపోకలను రద్దు చేశారు.

రూ.37.95 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థకు భవనం

- ప్రతిపాదనలు ఆమోదించిన సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయం, సంస్థ కార్యాలయ భవనాన్ని మహారాణిపేటలోని సొంత స్థలంలో రూ.37.95 కోట్లతో నిర్మించేందుకు చేసిన ప్రతిపాదనలను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన అతని చాంబర్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఏపీ విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించారు. అనంతరం పాలన ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపాలని తీర్మానించారు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో గ్రంథాలయ భవనానికి రూ.25 లక్షలతో చేసిన ప్రతిపాదనలను కూడా ఆమోదించారు. జిల్లాలోని వివిధ గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాల కొనుగోళ్లకు రూ.ఆరు లక్షలు కేటాయించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, వయోజన విద్యాశాఖ డీడీ ఎస్.సుబ్రహ్మణ్యవర్మ, విద్యాశాఖ ఏడీ గోపి తదితరులు పాల్గొన్నారు.